జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php








సంపుటి 15 సంచిక 165 విశాఖపట్నం | మంగళవారం 14 ఫిబ్రవరి 2023 | 8 పేజీలు | వెల : 5.00




## కేంద్రం ప్రకటనతో...

# రియల్టర్లలో కొత్త ఆశలు

### అర్ధాంతరంగా నిర్మాణాల నిలిపివేత

### బీడు భూములను తలపిస్తూ..

### ఎక్కడ చూసినా టులెట్ బోర్డులే..

అమరావతి, : రాజధానిపై కేంద్ర ప్రకటన అమరావతి ప్రాంత రియల్టర్లలో ఆశలు రేకెత్తిస్తోంది. మరికొద్ది రోజుల్లో అమరావతి రాజధానిపై సుప్రీం తీర్పు వెలువడనున్న తరుణంలో.. విభజన చట్టం మేరకే అమరావతి రాజధానిగా ఏర్పడిందంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్రమంత్రి రాతపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రకటనకు రాజకీయ పార్టీలు వేర్వేరు భాష్యాలు చెపుతున్నప్పటికీ.. రాజధాని తరలింపు ఉండబోదనే సంకేతాలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో ఆశాభావాన్ని నింపుతోంది. రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని ప్రభుత్వం రాజధానిగా ప్రకటించింది. గుంటూరు, విజయవాడ మధ్యన వెలగపూడి ప్రాంతంలో ప్రభుత్వం రాజధాని ఏర్పాటు చేయడంతో పెద్ద ఎత్తున రియల్ వ్యాపారం జరిగింది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వందలాది రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. గుంటూరు- విజయవాడ మధ్యన చెన్నై రహదారికి ఇరువైపులా తాడేపల్లి నుంచి మంగళగిరి వరకు పెద్ద ఎత్తున అపార్టుమెంట్లు.. విల్లాల నిర్మాణం చేపట్టారు. రూ.వందల కోట్లు పెట్టుబడులు పెట్టి ఇక్కడ రియల్ వ్యాపారం మొదలు పెట్టిన వ్యాపారవేత్తలు మూడు రాజధానుల ప్రకటనతో కుదేలయ్యారు. నిర్మాణ సమయం లోనే విల్లాలు, అపార్టుమెంట్లకు పెద్ద ఎత్తున డిమాండ్ ఏర్పడింది. కొందరు అడ్వాన్సులు కట్టి ఫ్లాట్లు, విల్లాలు బుక్ చేసుకున్నారు. మరికొన్ని చోట్ల నిర్మాణం పూర్తయితే మరింత రేటు వస్తుందనే ఆశాభావంతో నిర్మాణదారులు ముందస్తు బుకింగ్‌కు ఇష్టం చూపలేదు. ఇక వెంచర్లలో పెద్ద ఎత్తున అడ్వాన్సులు చెల్లించి ప్లాట్లు బుక్ చేసుకున్నారు. వివిధ వర్గాల నుంచి స్పందన పెద్ద ఎత్తున వస్తున్న నేపథ్యంలో.. వ్యాపారులు సైతం రైతులతో ఒప్పందం చేసుకొని రియల్ ఎస్టేట్ వెంచర్లు వేశారు. ఈ క్రమంలో శాసనసభ సాక్షిగా ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి మూడు రాజధానుల ప్రకటనతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. పెట్టిన పెట్టుబడి కూడా వస్తుందనే భరోసా రాని స్థితిలో కేంద్ర ప్రభుత్వ ప్రకటన రియల్ వ్యాపారుల్లో కొంత మనోధైర్యాన్ని కలిగిస్తోంది. సుప్రీం తీర్పు కోసం వారు ఆశావాదంతో ఎదురు చూస్తున్నారు.

**అర్ధాంతరంగా నిర్మాణాల నిలిపివేత**

మూడు రాజధానుల ప్రకటనతో ఒక్కసారిగా నిర్మాణాలు మందగించాయి. రాజధాని అనే భావనతో ఆసక్తి చూపిన కొనుగోలుదారులు..ఆ తర్వాత కొనుగోళ్ల విషయంలో ఆచితూచి వ్యవహరించారు. రాజధానిలో సొంతింటి కల నేరవేర్చుకోవాలనుకున్న వారు సైతం ప్రభుత్వ ప్రకటనతో విరమించుకున్నారు. అప్పటికే పెట్టుబడి పెట్టిన వారు ఏం చేయాలో పాలుపోని స్థితి. వందల కొద్దీ ఫ్లాట్లు కొనుగోలుదారుల లేక వెలవెలబోయాయి. పలువురు రియల్ వ్యాపారులు బ్యాంకు రుణాలతో నిర్మాణాలు చేపట్టారు. ఇదే క్రమంలో నిర్మాణాలు కొనసాగిస్తే పరిస్థితి ఏంటనే దానిపై సందేహాలు నెలకొనడంతో ముందుకు వెళ్లలేని స్థితి. బ్యాంకు రుణాలు తీసుకొని నిర్మాణాలు మొదలు పెట్టిన వారు ముందుకు వెళ్లలేక..వెనక్కి రాలేక అడకత్తెరలో పోక చక్క మాదిరి తమ పరిస్థితి ఉందని వాపోతున్నారు.

# గవర్నర్ తో సీఎం జగన్ భేటీ..

## గవర్నర్ సేవలను కొనియాడిన సీఎం




విజయవాడ: ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, సుప్రవ హరిచందన్ దంపతులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, భారతీ రెడ్డి దంపతులు సోమవారం రాజ్ భవన్ లో మర్యాద పూర్వకంగా కలిసారు. గవర్నర్ హరిచందన్ ఆంధ్రప్రదేశ్ నుండి చత్తీస్ ఘడ్ గవర్నర్ గా బదిలీ అయిన నేపథ్యంలో వీరి భేటీ జరిగింది. ఈ సందర్భంగా బిశ్వ భూషణ్ హరిచందన్ తో ముఖ్య మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ గవర్నర్ గా అందించిన సేవలను గుర్తుంచుకుంటారన్నారు. మచ్చలేని వ్యక్తిత్వంతో, కరోనా విపత్కర పరిస్థితులను అధిగమించి, రాష్ట్రం ప్రగతి పథంలో పయనించడానికి ఎంతో సహకారాన్ని అందించారన్నారు. అధికార కార్యకాలాపాల నిర్వహణలో ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా, నిండైన హుందాతనంతో వ్యవహరించారని, అత్యుత్తమ రాజకీయ పరిణితి చూపి రాష్ట్ర ప్రజల హృదయాలను గెలుచుకున్నారని గవర్నర్ తో సిఎం అన్నారు. గవర్నర్‌గా రాష్ట్రానికి అందించిన సేవలను కొనియాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం సాధించి, మంచి సంబంధాలు సజావుగా సాగడంలో కీలక భూమిక పోషించారని, రాజ్యాంగానికి వన్నె తెచ్చారని సిఎం అన్నారు. ఆత్మీయతను తెలుగు ప్రజలకు పంచారని, రాష్ట్రం నుంచి వెళ్లవలసి రావటం బాధాకరమైనా, దేశంలోని మరో రాష్ట్రానికి గవర్నర్‌గా వెళ్లడం ద్వారా అక్కడి ప్రజలకు మేలు చేయగలుగుతారని ప్రస్తుతించారు. తొలుత రాజ్ భవన్ కు చేరుకున్న ముఖ్యమంత్రికి గవర్నర్ సంయిక్త కార్యదర్శి సూర్య ప్రకాష్, ఉపకార్యదర్శి నారాయణ స్వామి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఛైర్మన్ మల్లాది విష్ణు, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి రేవు ముత్యాల రాజు, ఎన్ టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు, నగర పోలీసు కమీషనర్ కాంతి రాణా టాటా, ఉప కమీషనర్ విశాల్ గున్ని, రాష్ట్ర ప్రోటోకాల్ డైరెక్టర్ బాల సుబ్రమణ్య రెడ్డి పాల్గొన్నారు.

## ప్రధానితో సన్నిహితంగా ఉన్నందునే అదానీకి అందలం : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : అదానీ గ్రూప్‌పై తన పార్లమెంట్ ప్రసంగాన్ని ఎడిట్ చేశారని, ప్రసంగంలోని పలు భాగాలను రికార్డుల్లో అనుమతించలేదని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధాని నన్ను అవమానించేలా మాట్లాడిన పదాలను రికార్డుల నుంచి తొలగించలేదని, తన ప్రసంగ భాగాలను మాత్రం ఎడిట్ చేసి పార్లమెంట్ రికార్డులకు ఎక్కించలేదని దుయ్యబట్టారు. ప్రధాని తనను నేరుగా అవమానిస్తూ తన పేరు చివర నెహ్రూ కాకుండా గాంధీ అని ఎందుకు ఉందని ప్రశ్నించారని అన్నారు.దేశ ప్రధాని స్వయంగా అలా మాట్లాడినా ఆ పదాలను రికార్డుల నుంచి తొలగించలేదని రాహుల్ తప్పుపట్టారు. పార్లమెంట్‌లో తాను మాట్లాడిన అంశాలను రాహుల్ గుర్తుచేశారు. ప్రధాని మోదీ, గౌతం అదానీల మధ్య సంబంధంపై తాను మాట్లాడానని, ఎలాంటి చెడ్డ పదాలు ఉపయోగించలేదని పేర్కొన్నారు. ప్రధానితో అదానీ విదేశీ పర్యటనలకు వెళ్లగా ఆయా దేశాల్లో కాంట్రాక్టులు ఆయనకు దక్కాయని అన్నారు.కేరళలోని వయనాడ్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు.ప్రధానితో సన్నిహితంగా ఉన్నందునే ఈరోజు దేశంలో 30 శాతం ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్ అదానీ ఎయిర్‌పోర్టుల నుంచే సాగుతున్నదని తెలిపారు. ఈ ఎయిర్‌పోర్ట్‌లను అదానీ దక్కించుకునేందుకు నిబంధనలు ఎలా మార్చారనేది తాను పార్లమెంట్ ప్రసంగంలో వివరించానని గుర్తుచేశారు. బంగ్లాదేశ్, శ్రీలంక, ఆస్ట్రేలియాల్లో ప్రధాని పర్యటన అనంతరం అదానీకి ప్రాజెక్టులు, రుణాలు మంజూరయ్యాయని ఆరోపించారు. అదానీ, అంబానీలతో ప్రధాని సంబంధాలపై మాట్లాడితే ఆయన అవమానంగా భావిస్తారని కానీ వారితో ప్రధాని మోదీ ఉల్లాసంగా గడుపుతున్న ఫోటోలను మీరు ఇంటర్‌నెట్‌లో చూడవచ్చని రాహుల్ పేర్కొన్నారు. అదానీ విమానంలో ప్రధాని ప్రయాణించడం మీరు చూడవచ్చని, అదానీతో సరదాగా ముచ్చటించడం కూడా మీ కంటపడుతుందని వ్యాఖ్యానించారు.

## బెంగళూరులో ఎయిర్‌షోని ప్రారంభించిన ప్రధాని




బెంగళూరు : ఆసియాలోనే అతి పెద్ద వైమానిక ప్రదర్శనకు కర్ణాటక వేదికయింది. బెంగళూరులోని యలహంక వైమానిక స్థావరంలో జరగనున్న 14వ ఎయిర్ ఇండియా షోను సోమవారం ప్రధాని ప్రారంభించారు. ఐదురోజులపాటు (ఫిబ్రవరి 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు) జరిగే ఈ ఎయిర్ షోలో 98 దేశాలకు చెందిన 809 రక్షణ, వైమానిక రంగ ప్రదర్శనకారులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా భారత్ వివిధ దేశాల రక్షణ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోనుంది. ఈ షోలో చివరి రెండు రోజులైన 16,17 తేదీల్లో సామాన్యులు తిలకించేందుకు కర్నాటక ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. నిర్వాహకులు ఎంట్రీ టికెట్‌ను రూ.1000గా నిర్ణయించారు.కాగా, ఈ షోలో భారతీయ, విదేశీ రక్షణ రంగ సంస్థలు ఎయిర్‌బస్, బోయింగ్, లాక్హీడ్, మార్టిన్, ఇజ్రాయెల్ ఏరోస్పేస్, బ్రహ్మోస్ ఏరోస్పేస్, ఆర్మీ ఏవియేషన్, హెచ్‌సీ రోబోటిక్స్, సాబ్, సఫ్రాన్, సాబ్, సఫ్రాన్, రోల్స్ రాయిస్, ఎల్ అండ్ టీ, భారత్ ఫోర్జ్ లిమిటెడ్, హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, బీఈఎంఎల్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయి. ఇక ఇందులో ఇండియన్ పెవిలియన్ ద్వారా 115 సంస్థలు 227 ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. అందులో ఎల్‌ఆర్‌యూ, ఎల్‌సీఏ-తేజస్, ఎఫ్‌సీఎస్, డిజిటల్ ఫ్లై బై, మల్టీ రోల్ సూపర్ సోనిక్ ఫైటర్, ప్రభుత్వ, ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో తయారైన ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు.

## మార్చి 13వ తేదీకి రాజ్యసభ వాయిదా



ఢిల్లీ: పార్లమెంట్ సమావేశాలు మొదలైనప్పటి నుంచి రసాభాసగానే సాగాయి. ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టిన అంశాలను ప్రభుత్వం అంగీకరించక పోవడంతో ఉభయసభల్లో ప్రతిష్టంభన నెలకొంది. సోమవారం కూడా ఇదే తంతు కొనసాగింది. అదానీ గ్రూపుపై వచ్చిన అభియోగాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయడంతోపాటు కాంగ్రెస్ ఎంపీ రజనీ పాటిల్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ విపక్షాలు ఆందోళనకు దిగాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభ బడ్జెట్ సమావేశాలను మార్చి 13వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రకటించారు. రాజ్యసభలో విపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ఎట్టకేలకు ఛైర్మన్ అంగీకరించారు.దీన్ని వ్యతిరేకిస్తూ అధికార పార్టీ సభ్యులు నినాదాలు చేశారు. దీంతో ఖర్గే చేసిన వ్యాఖ్యలను తొలగిస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. విపక్షాలు ప్రశ్నోత్తరాలను అడ్డుకోవడంతో తొలుత సభను 11.50 నిమిషాల వరకు వాయిదా వేశారు. ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే ప్రసంగం నుంచి కొన్ని భాగాలను తొలగించడాన్ని కూడా విపక్షాలు తప్పుపట్టాయి. ఈ అంశంపైన కూడా సభలో ఆందోళన చేపట్టాయి. కొందరు ఎంపీలు వెల్‌లోకి దూసుకువెళ్లారు. రాఘవ చడ్డా, సంజయ్‌సింగ్, ఇమ్రాన్ ప్రతాప్‌గిరి, శక్తి సింగ్ గోహల్, సందీప్ పాఠక్, కుమార్ కేట్కర్‌లు వెల్‌లోకి దూసుకువెళ్లి నినాదాలు చేశారు.కావాలనే సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని, సభను నడిపించే తీరు ఇది కాదు అని, ఇప్పటికే చాలా సమయాన్ని వృథా చేశామని, హౌజ్‌లో ఇలాంటి గందరగోళం సరికాదు అని, ప్రజల ఆశయాలకు తగ్గట్లు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని రాజ్యసభ ఛైర్మెన్ జగదీప్ ధన్‌కర్ తెలిపారు. వత్తిడిలో విధులు నిర్వర్తిస్తున్నట్లు మల్లిఖార్జున్ ఖర్గే చేసిన ఆరోపణలను ఛైర్మెన్ ఖండించారు.

# దేశంలోనే అత్యంత అరుదైన బ్లాక్ బెల్ట్ ఎనిమిదవడాన్ అవార్డు పొందిన చీరాలవాసి టి.వి.రమణ



చీరాల, ఫిబ్రవరి 13, ప్రజాపాలన : దేశంలో అత్యంత అరుదైన ఘనత అయిన బ్లాక్ బెల్ట్ ఎనిమిదోడాన్ అవార్డును సాధించిన, చీరాల వాసి హాన్షి టి.వి.రమణ కు ప్రశంసలు వెల్లువెత్తాయి. యుద్ధకళలు నేర్చుకోవాలనే ఆశయంతో, 1973 సంవత్సరంలో కర్రసాము, కుస్తీలను నేర్చు కొనుట ప్రారంభించి,1977 సంవత్సరంలో కరాటే కళ అధ్యయనం మొదలుపెట్టి, హాన్షి కె.యల్.సురేంద్ర శిష్యరికంలో, కరాటే-డో, కొబుడో, అయికిడో, కిక్‌బాక్సింగ్, బాక్సింగ్, ఇండియన్ అండ్ చైనీస్ వెపన్స్, యోగ వంటి కళలనే కాక,కరాటే యందలి వివిధరకములైన స్టైల్స్ షోటో కాన్, షిటోర్యు, గోజుర్యు, వాడోర్యు, షోరిన్ ర్యు,కోకెన్ షింకాయ్ విధానాలను నేర్చుకొన్నారు. అతని ప్రతిభను గుర్తించి,అంతర్జాతీయ యుద్ధ కళలసంస్థలు "ఓపున్ జుట్స్ షిహన్‌కాయ్ వరల్డ్ ఎలైట్ మాస్టర్స్ అసోసియేషన్-ఇటలీ,"యు.యస్.ఏ.మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్, టెక్సాస్, అమె రికా" లు తమ ఆర్గనైజేషన్ ల తరపున "భారత ఉపఖండ దేశాలకు ప్రెసిడెంట్, సెక్రటరీ అండ్ కన్వీనర్"గా నియమించి గౌరవించాయి.అలా గే " షోటోకాన్ కరాటే-డో బుడోర్యు ఫెడరేషన్ - స్కాట్ ల్యాండ్ ", "వరల్డ్ మార్షల్ ఆర్ట్స్ కౌన్సిల్ - ఫిలిప్పైన్స్"," ర్యూ క్యూ కొబుడో షింబు కాన్- ఒకినవా, జపాన్‌లు మెంబర్షిప్స్ ఇచ్చి గౌరవించాయి.తను నేర్చుకున్న సంస్థ " ట్రెడి షనల్ అండ్ స్పోర్ట్ షోటోకాన్ కరాటే-డో ఆర్గనై జేషన్ "నకు అధ్యక్షులు గా నియమించబడటం, ఆయన ఏకాగ్రత, పట్టుదల,యుద్ధకళల అధ్యయనం, జాతీయ, అంతర్జాతీయ కోచ్, రిఫ్రీ, జడ్జి గా పనిచేయడం, వివిధ యుద్ధకళలు కరాటే, కొబుడో, అయికిడో, కిక్ బాక్సింగ్, బాక్సింగ్, ఇండియన్ వెపన్స్, చైనీస్ వెపన్స్, హెూచి మిన్ చాయ్ కుంగ్-ఫూ, యోగా లలో సీనియర్ మాస్టర్ స్థాయిని సాధించారు." ఇండియన్ యమగుచి "బిరుదును పొందిన టి. వి.రమణ, తన విద్యార్థులకు, అంతర్జాతీయ సిలబస్ ను మాత్రమే నేర్పిస్తారు. చీరాల పట్టణానికి యుద్ధకళల కేంద్రంగా అంతర్జాతీయ, జాతీయ స్థాయి లో పేరు తెచ్చారు. అనేక మంది ఇతర యుద్ధ కళల మాస్టర్స్ చీరాల వచ్చి, హాన్షి టి. వి. రమణ వద్ద శిక్షణ తీసుకోవటానికి వస్తుంటారు. కానీ చీరాల ప్రజలు నిజమైన కళలను గుర్తించే స్థితి లో లేక పోవటం బాధాకరమని, పలుసార్లు రమణ ఆవేదన వ్యక్తం చేశారు.

50 సంవత్సరాల అధ్యయనం, యుద్ధకళల అభివృద్ధికి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి లో, యుద్ధకళలకు గుర్తింపు వచ్చేలా, ఆయన నిజాయితీగా చేసిన కృషి, అందించిన సేవల కు, తన గురువుల పట్ల నిబ ద్దత, గొప్ప కళలను ముందు తరాలకు గొప్పగా అందించాల నే తపన, ప్రపంచం లోనే తన విద్యార్థులకు, అత్యధిక సిలబస్ ను, నేర్పించిన రమణ ఘనతను గుర్తిం చిన ఆర్గనైజేషన్, హానరబుల్ అధ్యక్షులు, ఫౌండర్, హాన్షి కె. యల్.సురేంద్ర, సీనియర్ కరాటే మహిళా శిక్షకురాలు, టి.యస్.యస్.కె.ఓ. సెక్రటరీ లలిత లు, టి. వి. రమణ ను గుర్తించి, ఎగ్జామ్, ఇంటర్వ్యూ, పెర్ఫా ర్మన్స్ లలో, విజయం సాధించా క, ఈ నెల 12వ తేదిన, కరాటే కళ లో ప్రతిష్టాత్మకమైన " హచి డాన్ " ( 8వ డాన్ బ్లాక్ బెల్ట్ ) అవార్డు ను ప్రదానం చేశారు. శ్రమ, ఏకాగ్రత, నిజాయితీ, మంచితనం ఎప్పటికైనా విజయం సాధిస్తాయనే దానికి కరాటే భీష్మ గా, శిష్యులు పిలుచుకునే టి వి రమణ కృషి కి ఇది నిదర్శనమని, ఆయా రంగాల ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ, రమణకు శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

## వైసీపీ పాలనలో అటకెక్కిన యాంత్రీకరణ..!



పర్చూరు, ఫిబ్రవరి 13, ప్రజాపాలన : వైసీపీ పాలనలో అన్నదాతలకు ఆదరణ కరువైందని యాంత్రికరణ పథకాలు అటకెక్కడంతో అన్న దాతలకు అప్పుల భారం తప్పడం లేదని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమ వారం నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి విస్తృతంగా పర్యటించారు. తొలుత ఉదయం క్యాంప్ కార్యాలయంలో పలు గ్రామాల ప్రజలతో సమావేశమయ్యారు. పూనూరు గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ నాయకులు ఎమ్మెల్యే ఏలూరి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం నాయకులంతా సమన్వయంగా పనిచేయాలన్నారు.అనంతరం అన్నంబొట్లవారి పాలెం, అడు సుమల్లి, తిక్కరాజుపాలెం,గొల్లపూడి, భూసాయపాలెం చెరుకూరుగ్రామాలలో పర్యటించారు. ఆయా గ్రామాలలో పలువురిని పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన అన్నంపట్ల వారి పాలెం గ్రామానికి చెందిన చెన్నుపాటి వెంకటేశ్వర దశదిన కర్మలో పాల్గొని పాల్గొన్నారు. అనంతరం పలు గ్రామాలలో పలువురిని ఆత్మీయంగా పలకరించారు.తానున్నానంటూ మనోధైర్యం కల్పించారు. ఏ అవసరం వచ్చినా తనను సంప్రదిం చాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ పాలనలో అభివృద్ధి లేదని ప్రభుత్వ పథకాలను సైతం నిలిపివేసి అన్ని రంగాలను ప్రభుత్వం కుప్పకూల్చిందన్నారు.రాష్ట్రంలో అభివృద్ధి నామరూపాలు లేకుండా పోయిందని ... వైసిపి ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రం అభివృద్ధి లో పదేళ్ల వెనక్కి పోయిందన్నారు. ప్రజలపై పన్నుల బారాలు మోపుతూ తీవ్రఆర్థిక ఇబ్బందులు గురిచేస్తుందన్నారు.రకరకాల పన్నులు వేస్తూ. .. విద్యుత్ బస్సు చార్జీలు పెంచుతూ పేద మధ్యతరగతి ప్రజలను ఉక్కిరిబిక్కిరి గురిచేస్తుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రైత న్నల అభివృద్ధి కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఆధునిక యాంత్రికరణ పరికరాలు అందించేందుకు పలు పథకా లను రూప కల్పన చేయడం జరిగిందన్నారు. ట్రాక్టర్లు స్ప్రేయర్లు టార్పాలిన్లూ, డ్రిప్ ఇరిగేషన్ మైక్రో న్యూట్రియన్స్ , నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించడం జరిగిందన్నారు. నేడు వైసిపి పాలనలో ఏ ఒక్క రైతుకు ఎలాంటి సబ్సిడీపై యాంత్రికరణ పనిముట్లు అందడం లేద న్నారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు అప్పలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలం కలిసి రాక... పండించిన పంటలు గిట్టు బాటు దొరక లేక దేశానికి అన్నం పెట్టే రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం పథకాల ను నిలిపివేసి చోద్యం చూస్తుందని మండిపడ్డారు.రైతు ప్రభుత్వం అని గొప్పలు చెబుతూ రైతులను నిలువునా దగా చేస్తుందన్నారు. గత తెలు గుదేశం ప్రభుత్వ హయాంలో యాంత్రీకరణ పథకం అమలులో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది.టీడీపీ ప్రభుతంలో ఏటా 450-700 కోట్లు వరకు వ్యవసాయ యాంత్రీకరణ కొరకు ఖర్చుచేశామని తెలిపారు.వైసీపీ అధికారంలోకి వచ్చాక 2019 నుంచి ఒక్క యంత్రమూ ఇవ్వలేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంతోనే అన్నదాతలకు రైతు రాజ్యం వస్తుందన్నారు. అన్నదాతలు పశుసంపదను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అన్నదాతల కష్టసుఖాల్లో అనునిత్యం అండగా నిలుస్తున్న పశువులను బాధ్యతగా చూసుకోవాలన్నారు. ఒంగోలు జాతి అంతరించిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పర్చూరు మండల అధ్యక్షుడు షేక్ శంశుద్దీన్, మండల ప్రధాన కార్యదర్శి కొరటాల సురేష్, మాజీ మండల అధ్యక్షుడు మన హరిబాబు, ఎంపీటీసీ సభ్యులు రవిచంద్ర, నాయుడు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఆదినారాయణ ,అంకమ్మ చౌదరి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఉషారాణి, బాపట్ల పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ జమాలుద్దీన్, ఫ్యాక్టరీ శ్రీనివాసరావు, అప్పలనేని నరేందర్, వెంకటేశ్వర్లు రామకృష్ణ , వెంకటసుబ్బయ్య, వెంకట శివ తదితరులు పాల్గొన్నారు.

## గోకవరంలో చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాటులను పర్యవేక్షించిన మాజీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు నిమ్మకాయల రాజప్ప



గోకవరం ప్రజా పాలన ఫిబ్రవరి13: గోకవరంలో ఈనెల 15వ తారీఖున జరగనున్న మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను సోమవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ,మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, ప్రత్తిపాటి పుల్లారావు,మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ పర్యవేక్షించారు.గోకవరం దేవి చౌక్ సెంటర్లో వారు విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు 15వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు మధురపూడి విమానాశ్రయంలో దిగిన తరువాత రోడ్ షోగా గోకవరం వస్తారన్నారు. గోకవరంలో మండల ప్రజానీకంతో పాటు, చుట్టుప్రక్కలగల ఏజెన్సీ గ్రామ ప్రజలు కూడా చంద్రబాబు నాయుడును చూడడానికి వస్తున్నారు అన్నారు.అందుకోసం దేవి చౌక్ సెంటర్లో గల ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు అన్నారు. అనంతరం అక్కడ గుముకూడిన సబికులను ఉద్దేశించి ప్రసంగిస్తారు అన్నారు. తదుపరి చంద్రబాబు నాయుడు రోడ్ షో గా కొత్తపల్లి మీదుగా రాజుపూడి మీదుగా జగ్గంపేట వెళ్తారన్నారు.ఈ మార్గంలో కొత్తపల్లిలో సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. రాజపూడి లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, అక్కడ ప్రసంగిస్తారు అన్నారు. తదుపరి జగ్గంపేట చేరుకొని అక్కడ బహిరంగ సభలో పాల్గొంటారు.ఆ రాత్రి జగ్గంపేటలో జ్యోతుల నవీన్ ఇంటి వద్ద బస చేస్తారన్నారు. 16వ తేదీన పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారన్నారు.

## ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి :జగ్గంపేట మండలం గుర్రప్పాలెం రోడ్ లో ఉన్న మహాలక్ష్మి పౌల్ట్రీన్ కాంప్లెక్స్ ఆవరణ నందు న్యాయశాఖ,పోలీస్ మరియు లేబర్ ఆఫీస్ వారి ఆధ్వర్యంలో వెట్టిచ్చాకరి నిర్మూలన కొరకు ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయవాది ఎం. రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ జి సత్యనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

## వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా అప్రమత్తంగా ఉండాలి: ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట ఫిబ్రవరి 13 ప్రజాపాలన ప్రతినిధి: పట్ట ణంలోని డాంగేనగర్ వాటర్ ట్యాంకు వద్ద పైప్లైన్ పు నర్ నిర్మాణ పనులకు ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను శంకుస్థాపన చేశారురానున్న వేసవికాలం దృష్ట్యా పట్టణంలో అన్ని వార్డులలో త్రా గునీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా యుద్ధప్రాతి ప దికన మేరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అయన అధికారులకు సూ చించారు.ఈ సందర్భంగా ఉదయ భాను మాట్లాడు తూ పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో త్రాగునీరు సరఫరా సరిగా లేక ఇబ్బందులు పడుతు న్న విషయాన్ని స్థానికులు తమ దృష్టికి తీసుకు వ చ్చారని అన్నారు, ముఖ్యంగా డాంగే నగర్ లో ఉన్న వాటర్ ట్యాంకు వద్ద మోటార్ లు సరిగా పనిచేయక పోవడంతో ట్యాంక్ పైకి నీరు ఎక్కడం లేదు అని తమ దృష్టికి తీసుకురావడంతో కొత్తగా పైపు లైన్ వాల్వు ను ఏర్పాటు చేసి ప్రారంభించడం జరిగిందని అన్నా రు,దీని ద్వారా ఐదు వార్డుల వరకు ఎటువంటి అం తరాయం లేకుండా పుష్కలంగా నీటి సరఫరా జరు గుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర,వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్,హాఫీజున్నిసా ఫిరోజ్ ఖాన్,కౌన్సిల ర్లు,మున్సిపల్ ఎఇ హనుమంతరావు,తదితరులు పాల్గొన్నా రు.

## జనసైనికుడి కుంటుంబానికి ఆర్థిక సహాయం అందించిన పాఠంశెట్టి సూర్యచంద్ర

గోకవరం ప్రజా పాలన ఫిబ్రవరి 13: గోకవరం మండలం గోపాలపురం గ్రామంలోని గత కొంతకాలం క్రితం అకాల మరణం పొందిన జనసేన పార్టీకి చెందిన గూడవల్లి దావీదు.వారి కుంటుంబాని పరామర్శించి గోపాలపురం జనసైనికుల తో కలిసి10వేలు రూపాయల ఆర్థిక సహాయం అందించిన జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర. ఈ సందర్భంగా పాఠంశెట్టి సూర్యచంద్ర మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే అకాల మరణం పొందిన దావీదు ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుంటుంబానికి జనసేన పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని అందులో భాగంగానే ఈరోజు ఎంతో కొంత చేదోడు వాదోడుగా సహాయం చేయాలనే ఉద్దేశంతో గోపాలపురం జనసేన పార్టీ నాయకులు కార్యకర్తల సహాయంతో 10వేలు రూపాయలను అందించం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో గోపాలపురం జనసేన శ్రేణులు పాల్గొన్నారు.



జగ్గంపేట తేజ టీవీ రిపోర్టర్, బాలాజీ స్టూడియో అధినేత సందక పద్మనాభం ఏకైక కుమార్తె, 99 టీవీ రిపోర్టర్ సందక వాసు చెల్లి పెళ్లి వేడుకలలో భాగంగా పెళ్లికూతురుని చేస్తున్న సందర్భంగా వధువును ఆశీర్వదిస్తున్న జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, కాకినాడ పార్లమెంటరీ టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ గారు, వైసిపి సేవాదళ్ స్టేట్ జనరల్ సెక్రెటరీ ఒమ్మి రఘురామ్, ఈనాడు విష్ణు, ప్రేమ్ 9 న్యూస్ రిపోర్టర్ సుధాకర్, నీలపల్లి అప్పారావు తదితరులు.

## తక్కువ ఖర్చుతో తెగుళ్ళ నివారణ మందు తయారీ అభినందనీయం: వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి



చీరాల, ఫిబ్రవరి 13, ప్రజాపాలన :తక్కువఖర్చుతో తెగుళ్ల నివారణకై, మందు తయారు చేసే విధానం ప్రశంసనీయమని, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు, తెగుళ్ల నివారణకు మందు తయారు చేసిన ఉద్యానశాఖ విద్యార్థుల కృషి అభినందనీయమని, వ్యవసాయ సలహా మం డ లి చైర్మన్ కావూరి రమణారెడ్డి అన్నారు. చీరాల మండలం కావూరివారిపాలెం పంచాయతీ పరిధిలో, శాస్త్రవేత్తల సూచనల మేరకు ఉద్యాన శాఖ విద్యార్థులు మందు తయారీని రైతులకు వివరించారు. పంటలు ఆశించే తెగుళ్లు ముఖ్యంగా వేరు కుళ్ళు తెగుళ్లు రాకుండా, బ్లైటెక్స్ అనే మందు ఉపయోగపడుతుంద న్నారు. ఒక కిలో కాపర్ సల్ఫేట్, ఒక కిలో సున్నము, 100 లీటర్ల నీటితో కలిపి,ఈ మందును తయారు చేయొ చ్చు అన్నారు. ముందుగా సున్నం కరిగించి తర్వాత కాపర్ సల్ఫేట్ ని కలపాలని, ఇనుము వస్తువు లేవైనా, ఉదాహరణకు కత్తి, బ్లేడు లాంటి వాటిని ఆ ద్రావణంలో ముంచినపుడు, అది తుప్పు పడితే, ద్రావణం సరిగా తయారైనట్లుగా నిర్ధారించుకుని, తెగుళ్ల నివారణకు వాడ వచ్చని, రైతులకు వివరించారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణా రెడ్డి పర్యవేక్షణలో, జరిగిన తెగుళ్ల నివారణ కు ఉపయోగించే, మందు తయారీ కార్యక్రమంలో, సంబంధిత శాఖల అధికారు లు, ఉద్యాన శాఖ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## రాజారావు జ్ఞాపకార్థం జీవన్ నగర్ యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్



జి.కొండూరు:ఫి బ్రవరి 13:(ప్రజాపాలన న్యూస్): జి.కొండూరు మండల పరిధిలోని వెల్లటూరు గ్రామంలో కార్మికులు, శ్రామికుల కష్టజీవి దుప్పల రాజారావు ఈనెల 5-2-2023 న అనారోగ్య కారణంతో మృతి చెందడం జరిగింది.ఈ హఠాత్తు పరిణామంతో వెల్లటూరు జీవన్ నగర్ యూత్ ఆవేదనకు గురయ్యారు.దుప్పల రాజారావు జ్ఞాపకార్థం జీవన్ నగర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం,సోమవారం రెండు రోజులు పాటు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు.ఈ టోర్నమెంట్ సందర్భంగా జిల్లా నుండి పలువురు వాలీబాల్ ఆటగాళ్లు ఈ టోర్నమెంట్ లో పాల్గొనగా,ఈ సందర్భంగా వెల్లటూరు గ్రామ సర్పంచ్ వేల్పూరి సుజాతమ్మ,ఆమె భర్త సోషల్ వెల్ఫేర్ వర్కర్ వేల్పూరి మరియాన్న మరియు వెల్లటూరు చర్చి ఫాదర్,తదితరులు వాలీబాల్ ఆటగాళ్ళను స్వాగతించి,ఆటను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వాలీబాల్ టోర్నమెంట్లో మొదటి బహుమతి గెలిచిన వారికి 10వేల రూపాయులు,రెండవ బహుమతి గెలిచిన వారికి 7 వేల రూపాయలు,మూడవ బహుమతి గెలిచిన వారికి 5వేల రూపాయలు పంపిణీ చేయడం జరుగుతుందని వారు తెలిపారు.ఈ సందర్భంగా చర్చి ఫాదర్ మాట్లాడుతూ,దుప్పల రాజారావు గ్రామంలో అన్ని వర్గాలని కలుపుకొని పోతూ,కష్టజీవిగా అందరి మన్నలను పొందాడని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,జీవన్ నగర్ యూత్ యువకులు,మహిళలు అత్యధికంగా పాల్గొని వాలీబాల్ టోర్నమెంట్ ను తిలకించరు.

## శాఖల పరంగా నిర్వహించే సమావేశాల్లో నివేదికను ఏర్పాటు చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలి: పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి



పల్నాడు జిల్లా నరసరావుపేట ఫిబ్రవరి 13 : శాఖల పరంగా నిర్వహించే సమావేశాల్లో నివేదికను ఏర్పాటు చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశాలు ఇచ్చారు. సోమవారం పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని బిఆర్ అంబేద్కర్ స్పందన హాలులో ప్రజల నుండి అర్జీలను స్వీకరించే స్పందన కార్యక్రమం నిర్వహించి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జాయింట్ కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ వసంత బాబు ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సుమారు వివిధ సమస్యలపై వచ్చిన 137 అర్జీలను సంబంధిత శాఖలకు అందజేశారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తొలుత జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులు మరియు మండల ప్రత్యేక అధికారులతో సమీక్షిస్తూ ఆయా శాఖల పరంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న సమీక్ష సమావేశాలకు అనుగుణంగా నివేదికలు రూపొందించాలని తద్వారా సమస్యల పరిష్కారానికి మరింత అవకాశం ఏర్పడి మండల వారీగా ప్రథమ స్థానాలలో ఉండే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహణకు విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ మరియు ఏపీఎస్ఆర్టీసీ శాఖలవారు సమన్వయంతో సహకరించి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చూడాలని సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు మేరకు ఈనెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న ఫైనాన్షియల్ లిటరసీ క్యాంపెయిన్ కి సంబంధించి పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమ అనంతరం సుదూర ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమంలో అర్జీలు ఇవ్వడానికి వచ్చిన వచ్చిన ప్రజలకు మధ్యాహ్న భోజనాన్ని అందజేసిన లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రత్నాకరం వరప్రసాద్, జీవి సూర్యనారాయణ, రవి ప్రసాద్ నాగలక్ష్మి తదితరులను జిల్లా కలెక్టర్ శ్రీ శివశంకర్ లోతేటి, జాయింట్ కలెక్టర్ శ్రీ ఏ శ్యాం ప్రసాద్ సముచిత రీతిలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## ఎం కె ఎం బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా కోతకాలపు పండుగ ప్రార్థనలు



పల్నాడు జిల్లా నరసరావుపేట ఫిబ్రవరి 13 (ప్రజా పాలన ప్రతినిధి.): ఎం కె ఎం బాప్టిస్ట్ చర్చ్ చలో ఘనంగా కోతకాలపు పండుగ ప్రార్థనలో నిర్వహిస్తున్నామని బాప్టిస్ట్ చర్చ్ ప్రెసిడెంట్ పంగులూరి విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం నుండి ఈ ప్రాంతంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాప్టిస్ట్ చర్చి నందు క్రైస్తవ సోదరి సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో దేవుడిని ప్రార్థించే రోజు ఈరోజు కోతకాలపు పండుగ దీని యొక్క అర్థం దేవాతిదేవుడు ప్రజలందరిని సంవత్సరాంతం మొదలుకొని సంవత్సరాంతము చివరి వరకు దేవుడు ఇచ్చినటువంటి ఆశీర్వాదాలకు గుర్తుగాను అలాగే పండించిన పంటలకు మరియు చేసిన వ్యాపారాలకు ప్రథమ ఫలము దేవునికి ఇచ్చేదే కోతకాలపు పండుగ ముఖ్య ఉద్దేశం అని టౌన్ బాప్టిస్ట్ చర్చ్ ప్రెసిడెంట్ పంగులూరి విజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమమును టౌను బాప్తిస్తూ చర్చి సంఘ కాపరి రెవరెండ్ మున్నంగి ఎలిషా ఈరోజు క్రైస్తవ సోదరి సోదరులకు కోతకాలపు పండుగ యొక్క ముఖ్య ఉద్దేశమును తెలియపరిచారు. దేవుని ఆశీర్వాదాలు సంవత్సరం మొదలుకొని సంవత్సరం చివరి వరకు ఉండాలని దేవాది దేవుడిని ప్రార్థించారు. బాప్టిస్ట్ చర్చి ముందు స్టాల్స్ ఏర్పాటు చేసినట్టు చేసినటువంటి ప్రతి ఒక్కరికి అలాగే వారికి సహకరించినటువంటి ఎగ్జిక్యూటివ్ కమిటీ వారికి నిర్మాణ కమిటీ వారికి స్త్రీల సమాజానికి యూత్ కమిటీ వారికి అందరికీ కూడా దేవాది దేవుని నామములో మీ అందరికీ శుభాకాంక్షలు తెలియపరుస్తున్నమని పంగులూరి విజయకుమార్ నరసరావుపేట టౌన్ బాప్టిస్ట్ చర్చి ప్రెసిడెంట్ తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక - స్పందన కార్యక్రమం



పల్నాడు జిల్లా నరసరావుపేట ఫిబ్రవరి 13 (ప్రజాపాలన ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని పల్నాటి జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొని లిప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఐపీఎస్ . నేటి కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించవలసినదిగా సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశించడం జరిగినదని తెలిపారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి,నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించడం జరిగినదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) %+%. బిందుమాధవ్ ఐపీఎస్ , డిఎస్పీలు విజయ భాస్కర్ రావు ,జయరాం ప్రసాద్ ,ఆదినారాయణ ,సీఐ సుభాషిణి ,ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రాజమహేంద్రవరంలో ఘనంగా రావిపాటి జన్మదిన వేడుకలు





రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి: తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం లో వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి రావి పాటి రామచంద్రరావు జన్మదిన వేడుకలు ఏజెన్సీ టైగర్ కీర్తిశేషులు ముత్యాల ముత్యాల రాయుడు మిత్రమండలి ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో ఆదివారం ఉదయం ఘనంగా కాస్మోపాలిటన్ క్లబ్ సమీపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మిత్ర మండల వ్యవస్థాపక అధ్యక్షులు సుంకర వెంకట భాస్కర రంగారావు అధ్యక్షత వహించారు. ప్రముఖ పారిశ్రామిక వ్యాపారవేత్త కోటిపల్లి కేశవరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాపాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెల్లి కుల సంక్షేమ సేవా సంఘం ఉపాధ్యక్షులు చెన్న వెంకటరమణ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. అన్నం దేవుల సత్యనారాయణమూర్తి (నాని) స్వాగతం తో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును రావిపాటి అభిమానుల సమక్షంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కేశవరావు కేకును కట్ చేశారు. వైయస్సార్సీపి రాజమహేంద్రవరం నగర శాఖ అధ్యక్షులు సంగిరెడ్డి వెంకటరమణ,, ప్రముఖ పాత్రికేయుడు గోపిశెట్టి రామచంద్రుడు, కో రెడ్డి దేవుడు, అల్లం కిరణ్, సంగిరెడ్డి వీర వెంకట వర కుమార్, సంగిరెడ్డిబాబా భరత్, సంగిరెడ్డి చరణ్ తేజ, ముత్యాల వీరబాబు, వడ్డాది వీరబాబు, వాసుపల్లి భవాని ప్రసాద్, ముత్యాల దుర్గారావు, వాసుపల్లి విజయ్ కుమార్ మొదలగువారు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయుటంలో చేయూతఅందించారు. తొలుత ఇటీవల తుర్కియ (టర్కీ), సిరియాల %ఎ%లో ఇటీవల సంభవించిన పెను భూకంపం లో మృతిచెందిన వేలాదిమందికి ఘనంగా సభలో నివాళులర్పించారు.: విజయవాడ కేంద్రంగా సజ్జ ధనుంజయ శరత్ సంపాదకత్వంలో వెలువడుతున్న జాతీయ తెలుగు దినపత్రిక ప్రజా పాలను స్నేహ న్యూస్ ఛానల్ 2023 వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఏజెన్సీ టైగర్ కీర్తిశేషులు ముత్యాల ముత్యాల రాయుడు మిత్రమండలి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో కాస్మపాలిటన్ క్లబ్ సమీపంలో ఘనంగా నిర్వహించారు. గరగసుమన్ బాబు కు సుంకర వెంకట భాస్కర రంగారావు కృతజ్ఞతలు తెలియజేశారు. ముత్యాల రాయుడు మిత్రమండలి ప్రజా సంబంధాల అధికారి కొమ్ము సుధీర్ కుమా ర్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

## కలెక్టర్‌రేట్‌లో నిర్వహించిన స్పందనలో 188 అర్జీదారులను స్వీకరించిన కలెక్టర్ హిమాన్ను శుక్లా



అమలాపురం జనవరి 13 ప్రజాపాలన ప్రతినిధి. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ స్పందన హాల్ నందు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లో సుమారు 188 ఫిర్యాదులు రాతపూర్వకంగా జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబులకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ అర్జీదారుల ఫిర్యాదుల పట్ల క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి నిబంధనల మేరకు తగు పరిష్కార మార్గాలు అర్జీదారుడు సంతృప్తి చే%శీ%దే స్థాయిలో పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు. అధికారులు పరిష్కరించిన సమస్యపై సంతృప్తి చెందని పక్షంలో మరల రీఓపెన్ అయ్యేందుకు అవకాశాలు ఉంటాయని, కావున పూర్తి సంతృప్తి స్థాయిలోనే సమస్యలు పరిష్కరిస్తూ గడువు దాటిన ఆర్జీలకు ఆస్కారం లేకుండా ప్రత్యేక దృష్టి సారించా లన్నారు. ఒకసారి దరఖాస్తు చేసిన అర్జీ మరలా పునరావృతం కాకుండా పరిష్కార సరళిని నాణ్యతతో చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. అన్ని రకాల అర్జీల పరిష్కార సరళి పై కూడా ప్రత్యేక ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. నిబంధన మేరకు పరిష్కార మార్గా లు పూర్తిస్థాయిలో చూపి స్పందన కార్యక్రమం పనితీరు పట్ల అర్జీదా రులలో విశ్వసనీయతను పెంపొం దించాలన్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ వారి సూచన మేరకు డిజిటల్ లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండి ఓటిపి సివివి పాస్వర్డ్ పిన్ను బ్యాంక్ ఖాతా నెంబర్లు వివరాలు గోప్యంగా ఉంచుకోవాలే తప్ప, ఎవరితోనూ పంచుకోరాదనే ప్రతి ఖాతాదా రులకు అవగాహన కల్పించే గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరిం చారు బీవీసీ కళాశాల ఓడలరేవు విద్యార్థులు పంటు సౌకర్యం లేక సుమారు 50 కిలోమీటర్లు తిరిగి కళాశాల చేరుకునే పరిస్థితులు నెలకొన్నా యని తమ కళాశాలకు చేరుకొను టకు పంటు సౌకర్యాన్ని పునరు ద్ధరించాలని కోరారు. సామాజిక భద్రతా పింఛన్లు, రేషన్ కార్డుల సమస్యలు, భూ సమస్య లపై దరఖాస్తులు ఎక్కువగా అందాయి .ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన చంద్ర, డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, ఐసి డిఎస్ పిడి జీవీ సత్యవాణి ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్సీలు కృష్ణారెడ్డి, చంటిబాబు, సిపిఓ వెంకటేశ్వర్లు శాఖ జె డి డాక్టర్ ఏ జైపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కే నాగేశ్వరరావు,జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె. లక్ష్మీనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్ ఏడి కె విశాలాక్షి డిసిహెచ్ఎస్ పద్మశ్రీ రాణి, కాలుష్య నియంత్రణ మండలి సహాయ ఇంజనీర్ జి కరుణ రేఖ, చేనేత జౌళి శాఖ సహాయ సంచా లకులు రాజు, గ్రామ వార్డు సచివా లయం అధికారి భీమేశ్వర రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ వి రవి సాగర్ డీఎస్ఓ పాపారావు డిఎం పౌరసరఫరాలు కె, తులసి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డి ఎం ఎం హెచ్ ఓ ఎం దుర్గారావు దొర, డిఆర్డిఏ పిడి శివశంకర ప్రసాద్, ఏపీడి ఎం ఎం జీలాని డ్వామా పీడీ ఎస్ మధు సూదన్, గృహ నిర్మాణ సంస్థ పిడి ఎం బాబూరావు, మత్స్యశాఖ డి జె డి షేక్ లాల్ మహమ్మద్ వివిధ శాఖలకు అధికారులు పాల్గొన్నారు.

## స్పందనలో 39 వినతుల స్వీకరణ




నరసాపురం, ఫిబ్రవరి13 (ప్రజాపాలన ప్రతినిధి) :స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ప్రతి పిర్యాదును అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని సబ్ కలెక్టరు ఎం. సూర్యతేజ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజల నుండి అందిన 39 పిర్యాదులను సబ్ కలెక్టర్ ఎం సూర్య తేజ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి అందిన అర్జీలను గడువులోగా పరిష్కరించే విధంగా మండలస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని స్పందనలో అందిన అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లు, హౌసింగ్, భూమి తగాదాలు, మత్స్యశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమం తదితర సమస్యలపై వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు ప్రయాణికులు చేరవేసే వాహనాలు ఫిట్నెస్ ఉండేలా చూసుకోవాలి: డిస్టిక్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ పరంధామ రెడ్డి



పల్నాడు జిల్లా. నరసరావుపేట. ఫిబ్రవరి 13 (ప్రజాపాలన ప్రతినిధి) : మహాశివరాత్రి సంద్భంగా జరుగనున్న కోటప్పకొండ ఉత్సవాలలో ప్రయాణికులను చేరవేసే వాహనాలకు తప్పనిసరిగా ఫిట్నెస్ ఉండేలా చూసుకోవాలని వాహన యజమానులను మరియు డ్రైవర్లను డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ టి.కె.పరందామ రెడ్డి కోరారు. స్థానిక డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసరు వారి కార్యాలయంలో వాహన డ్రైవర్లు మరియు యజమానులతో ఏర్పాటు చేసిన కార్యక్రంలో ఆయన మాట్లాడుతు ప్రయాణికుల భద్రతను దృష్టి లో ఉంచుకొని, సురక్షితమైన డ్రైవింగ్ చెయ్యాలని అవసరమైన ఫిట్నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, పర్మిట్, టాక్స్ మరియు పొల్యూషన్ సర్టిఫికట్స్ ఫోర్స్ లో ఉండేలా చూసుకోవాలని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని అన్నారు. పరిమితికి మించి అధిక సంఖ్యలో ప్రయాణికులను తీసుకొని వెళ్ళడం ప్రమాదకరమని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం వలన ట్రాఫిక్ జామ్ కి అవకాశం ఉందని, డ్రైవర్లు క్రమ పద్ధతిని పాటిస్తూ ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని కోరారు. మధ్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.ఇంకా ఈ సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ బి. సత్యనారాయణ ప్రసాద్, ఎన్. శివ నాగేశ్వరావు మరియు వాహన యజమానులు, డ్రైవర్లు పాల్గోన్నారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

మంగళవారం 14, ఫిబ్రవరి 2023

## కాంగ్రెస్‌ను ఈ భీష్ముడు కాపాడగలరా?

కాంగ్రెస్ చరిత్రలో బుధవారం నుంచి ఒక కొత్త అధ్యాయం ప్రారంభమవనున్నది. 1998 నుంచి కాంగ్రెస్ అధినేత్రిగా ఉన్న సోనియాగాంధీ పార్టీ అధ్యక్ష బాధ్యతలను మల్లికార్జున్ ఖర్గేకు అప్పగించనున్నారు. కాంగ్రెస్ చరిత్రలో ఇది ఒక చెప్పుకోదగ్గ మార్పు అనక తప్పదు. 1991లో భర్త రాజీవ్ గాంధీ చనిపోయిన బాధలో సోనియా పార్టీ పగ్గాలు చేపట్టలేదు. రాహుల్ గాంధీ పార్టీ పగ్గాలు చేపట్టేందుకు పదే పదే నిరాకరించడంతో చేసేది ఏమీ లేక మల్లికార్జున్ ఖర్గేకు బాధ్యతలు అప్పగించాలని సోనియా నిర్ణయించారు. నిజానికి అశోక్ గెహ్లాత్ రాజస్థాన్ ముఖ్యమంత్రి పదవి వదిలి పెట్టి పార్టీ అధ్యక్ష పదవి చేపట్టేందుకు అంగీకరించి ఉంటే ఖర్గేను రంగంలోకి దించాల్సిన అవసరం ఉండేదికాదు. గెహ్లాత్ ముళ్లకిరీటంగా భావించిన పార్టీ అధ్యక్ష పదవిని అంగీకరించేందుకు ఖర్గే సిద్ధమయ్యారు. అపార రాజకీయ అనుభవం, పాలనా సామర్థ్యం ఉన్నప్పటికీ అట్టడుగు వర్గాలకు చెందిన నేతలు ఎప్పటికప్పుడు విధేయత నిరూపించుకుంటూ, ఇచ్చిన పదవులను ప్రసాదంగా కళ్లకు అద్దుకుని నిర్వహించడం, అడిగినప్పుడు ఆ పదవులు వదులుకోవడం తప్ప వారికి వేరే గత్యంతరం ఉండదు. ఆ విధేయతే అత్యున్నత పదవి రాష్ట్రపతి నుంచి మంత్రి పదవులు, పార్టీ అధ్యక్ష పదవులు పొందేందుకు అవకాశాలు కలిగిస్తోంది. దామోదరం సంజీవయ్య, బంగారు లక్ష్మణ్, రాంనాథ్ కోవింద్, ద్రౌపది ముర్ము, మల్లికార్జున్ ఖర్గేలకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. జీవితంలో పలు దారుణాలు, అవమానాలు చవిచూసిన నేత ఖర్గే బాల్యంలో బీదర్ ప్రాంతంలో వేలాది రజాకార్లు గ్రామాలపై దాడులు చేసి ప్రజలను ఊచకోత కోసినప్పుడు ఆయన తల్లీ, చెల్లెలు ప్రాణాలు కోల్పోయారు. తండ్రితోపాటు తప్పించుకున్న ఖర్గే ఒక మిల్లులో పనిచేసి కష్టపడి చదువు పూర్తి చేశారు. ఆ వెన్వెంటనే కార్మిక నాయకుడుగా ఆయన ఖ్యాతి కెక్కారు. రిపబ్లికన్ పార్టీలో చేరి క్రియాశీలకంగా పనిచేస్తున్న సమయంలో దేవరాజ్ అర్స్ దృష్టిని ఆకర్షించి కాంగ్రెస్ రాజకీయాల్లో ప్రవేశించారు. 1999, 2004, 2013లో ముఖ్యమంత్రి పదవి ఆయనకు సమీపందాకా వచ్చి దక్కకుండా పోయింది. ప్రతీసారీ ఇతర సమీకరణాల వల్ల ఆయనకు ఆ పదవి దక్కలేదు. ఎస్ఎం కృష్ణ, ధరమ్ సింగ్, సిద్దరామయ్యలకు వివిధ సామాజిక కారణాల వల్ల అవకాశం లభించింది. ఖర్గే అవకాశం కోల్పోయిన ప్రతీసారీ అధిష్ఠానం ఆయనకు ఏదో ఒక పదవినిచ్చి సంతృప్తిపరిచింది. చివరకు ఆ రకంగానే ఆయన జాతీయ రాజకీయాల్లోకి వచ్చారు. కావేరీ నదీ జలాల వివాదం నుంచి నటుడు రాజకుమార్ కిడ్నాప్ వరకు ఎన్నో సంక్షోభాలను పరిష్కరించడంలో ఖర్గే కీలక పాత్ర నిర్వహించారు. కేంద్ర, రాష్ట్రాల్లో వివిధ శాఖల్లో మంత్రిగా తన సమర్థత నిరూపించుకున్నారు. హైదరాబాద్ కర్ణాటక ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీని పటిష్ఠంగా నిర్మించడమే కాక, భారతీయ జనతా పార్టీని బలంగా అడ్డుకున్నారు. 2014లో లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటక అంతటా మోదీ ప్రభంజనం వీచినా ఆయన హైదరాబాద్- కర్ణాటక ప్రాంతంలో బిజెపిని బలంగా ఢీకొన్నారు. లోక్‌సభకు కేవలం 44 మందే కాంగ్రెస్ నుంచి ఎన్నికైనప్పటికీ పార్టీ నేతగా మోదీ ప్రభుత్వాన్ని అడుగడుగునా అడ్డుకుని పార్టీ ఉనికిని చాటారు. దీనితో 2019లో మోదీ- అమిత్ షాలు ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టిసారించి ఖర్గేను ఆయన జీవితంలో తొలిసారి ఓటమి చవిచూసేలా చేశారు. ఆ ప్రాంతంలోకి బిజెపి చొచ్చుకురావడం మోదీ-షాల వ్యూహరచనకు సంకేతం. అయినప్పటికీ కాంగ్రెస్ ఖర్గేను వదిలిపెట్టకుండా రాజ్యసభలో పార్టీ నేతను చేయడం, ఇప్పుడు పార్టీ అధ్యక్షుడిని చేయడం యాదృచ్ఛికంగా జరిగింది కాదు. అనేక మంది సీనియర్ నేతలు వెళ్లిపోయినా పట్టించుకోని గాంధీ కుటుంబం 80 ఏళ్లు దాటిన ఖర్గేకు ఎంతో విలువనిచ్చింది. కేవలం ఇది విధేయతను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయం కూడా కాకపోవచ్చు. హైదరాబాద్ - కర్ణాటక ప్రాంతంతో పాటు మొత్తం కర్ణాటకలో కాంగ్రెస్‌కు సానుకూల పవనాలు వ్యాపించేలా చేయడంలో ఖర్గే కీలక పాత్ర పోషిస్తారని కాంగ్రెస్ వర్గాలు ఆశిస్తున్నాయి. కాంగ్రెస్‌కు ఖర్గే కంటే ఉత్తమ నేత మరొకరు లభించరని తెలిన తర్వాతే ఆయనకు పగ్గాలు కల్పించాలని గాంధీ కుటుంబం నిర్ణయించింది. యుక్త వయస్సులో దేవరాజ్ అర్స్‌తో పాటు తిరుగుబాటు చేసిన నేపథ్యం ఉన్నప్పటికీ ఎనిమిది పదుల వయస్సులో ఉన్న ఖర్గే అలాంటి ఆలోచనలు పెట్టుకునే అవకాశాలు లేవు. గత పదేళ్లుగా ఆయన పార్లమెంట్‌లో గాంధీ కుటుంబానికి తలలోనాలుకలా వ్యవహరిస్తూ వారి వ్యూహాలకు అనుగుణంగా పార్టీని నడిపారు. పలుసార్లు రాహుల్ గాంధీయే తన నాయకుడని, ఆయనను ప్రధానమంత్రి చేయడమే తన ధ్యేయంగా ప్రకటించిన ఖర్గే కాంగ్రెస్ సంస్కృతిని నరనరానా జీర్ణించుకున్నారు. అధికారం కోసం ఎటువంటి అకృత్యాలకైనా పాల్పడే కాంగ్రెస్ నేతల గురించి ఖర్గేకు వేరే చెప్పనవసరంలేదు. ఆయనకే ఆయన నియోజకవర్గంలో వెన్నుపోట్లు ఎదురయ్యాయి. రెండు రోజులకోసారి ఢిల్లీకి పనిగట్టుకునివచ్చే అసమ్మతివాదుల విషయంలో ఖర్గేకున్నంత అనుభవం మరొకరికి లేదు. ఇక బిజెపి మూలాలు ఖర్గేకు తెలిసినంత మరే నేతకూ తెలియకపోవచ్చు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం, రాజస్థాన్, కర్ణాటక, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అంతర్గత కుమ్ములాటలు నివారించడం, నేతలను బుజ్జగించడం, జీ-23 పేరిట నేతలు వేరు కుంపట్లు నడపడం, ఇతర పార్టీలకు నేతలు ఫిరాయించకుండా చూడడం ఖర్గే ముందున్న బాధ్యతలు. ఖర్గే అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడానికి ముందు రాహుల్ ఆదేశాల ప్రకారం రాజస్థాన్ వెళ్లి ముఖ్యమంత్రిని మార్చాలని ప్రయత్నించారు. కానీ ఆయనను పార్టీ ఎమ్మెల్యేలెవరూ కలుసుకునేందుకు సిద్ధపడకపోవడం, సిఎల్‌పి సమావేశానికి హాజరు కాకపోవడం వంటి విషాద పరిణామాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇప్పుడు పార్టీ అధ్యక్షుడైన తర్వాత ఆయన ఇలాంటి అగ్నిపరీక్షలు ఎన్నో ఎదుర్కోవాల్సి ఉంటుంది. గత ఎనిమిదేళ్లలో సోనియా, రాహుల్ హయాంలోనే దాదాపు 200 మంది ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీని వదిలిపెట్టారు. బిజెపి ప్రలోభాలకు గురై పిసిసి అధ్యక్షులు, సిఎల్‌పి నేతలు, చీఫ్ విప్‌లు కూడా ఫిరాయించారు. పార్టీ తరఫున పోటీ చేయాల్సిన వందలాది అభ్యర్థులు, నేతలు కాంగ్రెస్‌కు తిలోదకాలు సమర్పించారు. గులాంనబీ ఆజాద్, కపిల్ సిబాల్, జ్యోతిరాదిత్య సింధియా, ఆర్‌పిఎన్ సింగ్, రీటా బహుగుణ ఇలా ఎందరో నేతల గురించి చెప్పనక్కర్లేదు. సోనియా, రాహుల్ గాంధీలకే ఇట్లాంటి విషమ పరిస్థితి ఎదురైనప్పుడు ఖర్గే ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోగలరా అన్నది ప్రధాన ప్రశ్న. పార్టీ కార్యకర్తలు, నేతలకు అందుబాటులో ఉంటూ గాంధీ కుటుంబంతో పాటు అందర్నీ సంప్రదించి, ఒప్పించగలిగిన శక్తి ఉన్నందువల్ల ఖర్గే ఈ ప్రశ్నకు పరిష్కారాలు సాధించే అవకాశం లేకపోలేదని అనేకమంది కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఢిల్లీకి వచ్చే వివిధ నేతలను కలుసుకునేందుకు పార్టీనేతలెవరూ ఇప్పుడు అందుబాటులో లేరు. రాహుల్ గాంధీ పూర్తిగా విశ్వసించే కేరళ నేత కేసి వేణుగోపాల్‌ను కలుసుకోవడమే అతికష్టమైన పనిగా భావిస్తున్నారు. గతంలో వివిధ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను ఏఐసిసి కార్యాలయంలో కలుసుకోవడం సులభంగా ఉండేది.

# ఉపాధి గురించి ఏం చెబుతారు మోడీజీ?




ప్రజల జీవితాలు, వారి జీవనోపాధులపై 2023-24 సంవత్సరం కేంద్ర బడ్జెట్ పెద్ద దాడి చేసింది. ప్రజలకు నేరుగా ఆర్థిక ప్రయోజనాలు అందించగల పథకాలు, కార్యక్రమాలపై వ్యయాన్ని దేశవ్యాప్తంగా తగ్గించివేశారు. అయితే, విస్మరించిన అంశాలు పెద్దవి, మరింత ఆందోళనకరమైనవి. ప్రజలు ఎదుర్కొనే కీలక సమస్యలను నిర్లక్ష్యం చేయడమో లేదా పట్టీపట్టనట్టు వ్యవహరించడమో చేశారు. వీటిలో ముఖ్యంగా యువతలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్య వుంది. భారతదేశ జనాభాలో పనిచేయగలిగే యువత ఎక్కువగా వుందని గొప్పగా చెప్పుకునే అంశాన్ని ఇది నేరపూరితంగా నాశనం చేసింది.

గత 41 మాసాలుగా, నిరుద్యోగిత 7 శాతానికి పైగానే నమోదవుతూ వస్తోంది. ఒక్కోసారి అంతకంటే ఎక్కువే వుంటోందని సిఎంఐఇ సర్వే డేటా తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం నిరంతరంగా అధికంగానే వుంటోంది. 8-10శాతం మధ్య నమోదవుతోంది. ఇది ఏ మాత్రమూ ఆమోదయోగ్యం కాని అధిక రేటు. ప్రభుత్వ ఉదాసీనత, నిర్లక్ష్య ధోరణితో ఇదిలాగే స్థిరంగా కొనసాగుతూ వస్తోంది. గత మూడేళ్ళలో చూసినట్లైతే, మొత్తంగా ఉద్యోగుల సంఖ్య స్తబ్దుగా వుంది. కరోనా మహమ్మారికి ముందు అంటే 2020 జనవరిలో 41.1 కోట్ల ఉద్యోగులు వుంటే 2023 జనవరి నాటికి కూడా 40.9 కోట్ల మంది వున్నారు. ఇదిలా వుండగా, ఇదే కాలంలో, కార్మిక ప్రాతినిధ్యం రేటు (పనిచేయగలిగే వయసులో వున్న వారి జనాభా వాటా అంటే పని చేయడమో లేదా ఉద్యోగాలు చూసుకుంటున్న వారి సంఖ్య) 42.9 శాతం నుండి 39.8 శాతానికి క్షీణించింది. ఈ విభిన్నమైన చర్యలు భయంకరమైన, బాధాకరమైన స్థితి గురించి మాట్లాడుతున్నాయి-జనాభా పెరుగుతున్నా ఉపాధి చేసే వారి సంఖ్య పెరగడం లేదు. పైగా కార్మిక ప్రాతినిధ్య రేటు తగ్గిపోతోందంటే మరింతమంది నిరాశా నిస్పృహలకు గురవుతున్నారని, లేబర్ మార్కెట్ నుండి బయటకు వెళ్ళిపోతున్నారని అర్థమవుతోంది. జీవన ప్రమాణాలు క్షీణిస్తున్నాయని తెలుస్తోంది. అయితే, ఏడాదికి రెండు కోట్ల చొప్పున ఉద్యోగాలు సృష్టించబడతాయని లేదా దాదాపు 10 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వ ఖాళీలు త్వరలో భర్తీ చేయబడతాయని ప్రభుత్వం, ప్రధాని ప్రజలకు హామీ ఇస్తున్నారు. అందువల్ల, రాబోయే సంవత్సరానికి ద్రవ్య విధానాన్ని నిర్దేశించిన కేంద్ర బడ్జెట్‌లో...కనీసం ఈ ఉద్యోగాల సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కొన్ని చర్యలనైనా ప్రకటిస్తారని ఆశించడం సహేతుకమే. దీనికి భిన్నంగా, నిరుద్యోగితను ఎదుర్కొంటున్న వారికి కొంత ఉపశమనాన్ని కలిగించే ప్రస్తుతమున్న పథకాల్లో కొన్నింటికి నిధులను తగ్గించివేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) నిధులను 33 శాతం తగ్గించేశారు. 2022-23 (సవరించిన అంచనాల ప్రకారం)లో రూ.89,400 కోట్లు ఖర్చు పెట్టగా, 2023-24 సంవత్సరానికి రూ.60 వేల కోట్లకు కుదించేశారు. అలాగే, జాతీయ ఉపాధుల కార్యక్రమం (నేషనల్ లైవ్‌లీహుడ్స్ మిషన్) నిధులు కూడా గతేడాది బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే గణనీయంగా తగ్గిపోయాయి. ప్రత్యక్ష ఉపాధి పథకాల్లో ఈ కోతలతో పాటు....ఉద్యోగాలు సృష్టించబడతాయనుకున్న గ్రామీణ గృహ నిర్మాణ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్, ఇతర సంక్షేమ పథకాలకు కూడా కోత పడింది. ఆచరణలో ఐసిడిఎస్ నిధుల్లో పెరుగుదల లేదు. అంటే మంజూరైన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టుల్లో 2.4లక్షల ఖాళీలు ఈ ఏడాది కూడా అలాగే కొనసాగుతాయని అర్థమవుతోంది. అలాగే ఇతర పథకాలకు మరీ ముఖ్యంగా చెప్పాలంటే ఇతర విభాగాలు, మంత్రిత్వ శాఖలకు సంబంధించినంతవరకు ఇదే పరిస్థితి నెలకొంది.

ఈ బడ్జెట్‌లో ఉపాధి కల్పనా సామర్థ్యాల గురించి, గత విధానాల గురించి అనేక అసత్యాలను ప్రచారం చేయడంలో ప్రభుత్వం, దాని కీలక బాధ్యులు తలమునకలై వున్నారు. ఉద్యోగాలను సృష్టించగల మూల ధన వ్యయం కోసం మోడీ ప్రభుత్వం మరిన్ని మొత్తాలను కేటాయిస్తోందనేది వాటిల్లో ఒకటి. అయితే మౌలిక వసతుల కల్పన కోసం ఖర్చు పెట్టే దానికన్నా సామాజిక కేటాయింపులకు అంటే విద్య లేదా వైద్యం వంటి రంగాలపై ఖర్చు చేసినట్లైతే ఒక యూనిట్ ఖర్చుకు వచ్చే ఉద్యోగాలు మరిన్ని ఎక్కువగా వుంటాయన్నది ఇక్కడ అందరూ అంగీకరించగలిగిన, సుస్పష్టమైన వాస్తవంగా వుంది. అలాగే, మోడీ హయాంలో, విదేశీ యంత్రాల వంటి వాటిని మరింతగా దిగుమతి చేసుకోవడంలో మూల ధన వ్యయం ఇమిడి వుంది. అంటే దేశీయ ఉత్పత్తి, స్థానిక ఉద్యోగాలను పణంగా పెట్టి మూల ధన వ్యయంతో చేసుకునే దిగుమతులు పెరుగుతాయి.

పరిశ్రమలకు బ్యాంక్ రుణాలను సులభతరం చేయడం వల్ల ఉత్పాదక సామర్థ్యాలు విస్తృతమవుతాయని అంటే మరిన్ని ఉద్యోగాల సృష్టికి దారి తీస్తుందనేది మరో కట్టుకథ. గత కొన్నేళ్ళ అనుభవాలను చూసినట్లైతే కార్పొరేట్ రంగానికి ఇస్తున్న పలు రాయితీలు, మినహాయింపులు, సులభతరమైన రీతిలో రుణాలను అందించినా మరిన్ని ఉద్యోగాలు సృష్టించడంలో విఫలమయ్యాయి. కరోనా మహమ్మారి నెలకొన్న రెండేళ్ళలో లిస్టెడ్ కంపెనీల లాభాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. కానీ ఉపాధి కల్పన మాత్రం నిరాశపరిచే రీతిలోనే వుంది. ఇందుకు కారణమేంటనే వివరణ ఇవ్వడం చాలా తేలిక. నిరుద్యోగిత, తక్కువ ఆదాయాల కారణంగా ప్రజల్లో కొనుగోలు శక్తి తగినంతగా లేకుండా పోయింది. దానివల్ల వస్తువులు, సేవలకు డిమాండ్ తగ్గింది. అయితే రాయితీలు లేదా రుణాలనేవి ఉత్పత్తిని మరింత విస్తరించడానికి, మరింతమంది కార్మికులను తీసుకోవడానికి పరిశ్రమల యజమానులను ప్రలోభపెడతాయి. ఇటువంటి యజమానులకు ప్రభుత్వం రుణాల రూపంలో ఇచ్చే డబ్బంతా వారి లాభాల మార్జిన్‌ను మెరుగుపరుచుకోవడానికే ఉపయోగపడుతుంది. మొట్టమొదటగా పెద్ద నోట్ల రద్దు, ఆ తర్వాత జిఎస్‌టి దెబ్బ, అటుపై కరోనా మహమ్మారి ఇలా వరుస దెబ్బలతో తీవ్రంగా ధ్వంసమైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం (ఎంఎస్ఎంఇ) గురించి ఏం చెప్పుకోవాలి? ప్రస్తుత బడ్జెట్‌లో హామీ ఇచ్చిన తరహాలో ఈ రంగానికి సులభంగా రుణాలు అవసరం లేదా? భారతదేశంలో 6.33 కోట్ల ఎంఎస్ఎంఇల్లో 6.30 కోట్లు (99 శాతం) సూక్ష్మ సంస్థలే. 3.31 లక్షలు చిన్న తరహా యూనిట్లు, కేవలం 5వేలు మాత్రమే మధ్య తరహా సంస్థలు. సూక్ష్మ సంస్థల్లో దాదాపు 11 కోట్ల కార్మికులు వున్నారు. చిన్న తరహా సంస్థల్లో 32 లక్షల మంది వున్నారు. మధ్య తరహా సంస్థల్లో కేవలం 2 లక్షల కార్మికులే వున్నారు. కాబట్టి, ఎక్కువ ఉపాధిని సృష్టించేది సూక్ష్మ సంస్థలే. వీటికి నిధులు అవసరం. ఎంఎస్ఎంఇ రంగానికి ఉద్దేశించిన రుణంలో చాలా భాగం మధ్యతరహా సంస్థలకు వెళ్ళిపోతోంది. 2022 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఎంఎస్ఎంఇలకు ఇచ్చే రుణాలు చాలా తీవ్రంగా పెరిగాయి. చిన్న, మధ్య తరహా సంస్థలకు కలిపి రూ.2.57 లక్షల కోట్లు రుణాలు ఇవ్వగా, సూక్ష్మ సంస్థలకు కేవలం రూ.68.9 వేల కోట్లు మాత్రమే దక్కాయి. దీనంతటిని బట్టి స్పష్టమయ్యేదేమిటంటే నయా ఉదారవాద సిద్ధాంతం మత్తులో పడి మోడీ ప్రభుత్వ కళ్లుమూసుకుపోయాయి. బడా పెట్టుబడిదారుల-దేశీయ, విదేశీ-మీద అది పూర్తిగా ఆధారపడుతున్నది. వారిని ప్రోత్సహిస్తే ఆర్థిక వ్యవస్థకు వారే ఊపు తెస్తారని, ఉద్యోగ అవకాశాలు వాటంతటవే పెరిగిపోతాయన్నట్టుగా వ్యవహరిస్తున్నది. అసంభవమైన 'ట్రికిల్ డౌన్' సిద్ధాంతంపై దానికున్న నమ్మకమే ఉద్యోగ సంక్షోభ పరిష్కారంపై దృష్టి పెట్టకుండా దాని చేతులు కట్టిపడేస్తున్నది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తన విధానాలను సమూలంగా మార్చుకునేలా చేయడమో లేక వచ్చే ఎన్నికల్లో దానిని విసిరికొట్టడమో చేయాల్సిన అవసరముంది.

# పుస్తకాల పండుగ

గొప్ప గొప్ప వారందరూ గొప్ప పుస్తకాలు చదివినవారే...అంటారు. జాన్ రస్కిన్ 'అన్ టు దిస్ లాస్ట్' పుస్తకం గాంధీ, టాల్‌స్టారుల జీవితాన్ని ప్రభావితం చేసింది. ఈ పుస్తకం చదవక ముందు గాంధీ వేరు, చదివిన తర్వాత గాంధీ వేరు. 'ఈ పుస్తకంలోని భావాలు దీపంలా నాలో వెలుగుని ప్రసారం చేశాయి. సర్వోదయాన్ని నాకు బోధించాయి' అని గాంధీ తన ఆత్మకథలో రాసుకున్నారు. ప్లేటో రాసిన 'రిపబ్లిక్', అరిస్టాటిల్ రాసిన 'పాలిటిక్స్', కారల్‌మార్క్స్ 'కాపిటల్' ప్రపంచాన్ని ప్రభావితం చేసిన గ్రంథాలు. డార్విన్ 'ఆరిజన్ ఆఫ్ స్పీసిస్' ప్రకృతి శాస్త్రంలో, మనిషి ఆలోచనా ధోరణిలో విప్లవం తెచ్చింది. 'వసుచరిత్ర' పుస్తకమంటే తనకు ప్రాణమంటారు కందుకూరి వీరేశలింగం. 'పుస్తకాలు మహా మనుషుల మస్తకాలు' అంటాడు కొడవటిగంటి తన 'చదువు' నవలలో. యువల్ నోవా హరారీ అనే ఇజ్రాయిల్ చరిత్రకారుడు రాసిన ప్రముఖ గ్రంథం 'సెపియన్స్ (మానవులు)'. మానవ జాతుల గురించి వివరించే ఈ పుస్తకాన్ని ప్రపంచవ్యాప్తంగా అత్యధికులు చదివారు. చదవాల్సిందిగా సూచించారు. మేధావుల ఆలోచనలకు మనకున్న సాక్షి పుస్తకం. మానవ జీవన సాంస్కృతిక పరిణామ క్రమంలో పుస్తకాలు పోషించే పాత్ర అనిర్వచనీయం. 'ఈ ప్రపంచంలోకెల్లా అత్యంత అదృష్టవంతులు ఎవరైనా వున్నారంటే... పుస్తక పఠనం ద్వారా సంపూర్ణ ఆనందాన్ని పొందినవారే' అంటాడో తెలుగు నవలా రచయిత. పుస్తకం అంటే... కాగితాల దొంతరలు కాదు... మనిషిని మరో లోకంలోకి తీసుకెళ్లే శాటిలైట్. మనిషికి ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్నిచ్చేది... మహనీయుల భావజాలాన్ని, వారి వ్యక్తిత్వాన్ని మన కళ్ల ముందు ఆవిష్కృతం చేసేది పుస్తకమే. సాంకేతికంగా ఎంత అభివృద్ధి జరిగినా, ఎన్నటికీ మారనిది పుస్తకం. టీవీ సీరియళ్లు, ఓటీటీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, మొబైల్, ఇంటర్నెట్, సోషల్ మీడియా వంటివి విలువైన సమయాన్ని హరించివేస్తున్నాయి. పుస్తక పఠనానికి దూరం చేస్తున్నాయి. 'ఇమ్ముగ చదువని నోరు.. కుమ్మరి మన్ను తవ్వినట్టి గుంటర సుమతీ' అంటాడు బద్దెన. పుస్తక పఠనం, సమాజ అధ్యయనం.. ఈ రెండింటి మేలుకలయిక వల్ల ఎందరో సామాన్యులు అసామాన్యులుగా చరిత్రకెక్కారు. సాంకేతికత పెరిగిన ఈ కాలంలో కూడా పుస్తకం తన ప్రాధాన్యతను నిలుపుకుంటూనే వుంది. 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో... కానీ, ఓ మంచి పుస్తకం కొనుక్కో' అంటారు కందుకూరి. ఇప్పుడీ ప్రస్తావన ఎందుకంటే... ఫిబ్రవరి 9 నుంచి 19 వరకు విజయవాడలో పుస్తకాల పండుగ. ఈ పండుగ ఎక్కడ జరిగినా పుస్తక ప్రేమికులకు పసందైన విందే. ఆదియుగమైనా, ఆధునిక యుగమైనా జ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనం ముఖ్య సాధనం. వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుంది. చాంధస, మూఢ విశ్వాసాల సంకెళ్ల నుంచి విముక్తి కలిగిస్తుంది. పుస్తక పఠనం జ్ఞాపకశక్తిని, పద సంపత్తిని పెంచుతుంది. 'కదిలేది కదిలించేది/ మారేది మార్పించేది/ పాడేది పాడించేది/ మునుముందుకు సాగించేది/ పెనునిద్దర వదిలించేది/ పరిపూర్ణపు బ్రతుకిచ్చేది' పుస్తకమే. తరగతి గదిలో ఉపాధ్యాయుడు బోధించే విద్యకు... ఆన్‌లైన్ విద్య ఎలాగైతే ప్రత్యామ్నాయం కాజాలదో, అలాగే, ఏ సాంకేతికతా పుస్తకానికి ప్రత్యామ్నాయం కాలేదు. పెరిగిన సాంకేతికత వల్ల ఆన్‌లైన్‌లో కొన్ని అరుదైన పుస్తకాలు దొరకొచ్చు. ఇతర దేశాల్లోని సాహిత్యాన్ని అధ్యయనం చేసే అవకాశం వుండొచ్చు. కానీ, అందుబాటులో వున్న పుస్తకాన్ని కొనుక్కుని చదువుకోవడం, భద్రపర్చుకుని తర్వాతి తరానికి అందించడం అనే ప్రవాహానికి మిగతావేవీ ప్రత్యామ్నాయం కాదు. లండన్‌కి చెందిన ఆన్ మోర్గాన్ అనే పాత్రికేయురాలి బుక్‌షెల్ఫ్‌లో సుమారు 20 ఏళ్ల గొప్ప కలెక్షన్ వుంది. అవన్నీ ఇంగ్లీష్, నార్త్ అమెరికన్ పుస్తకాలే. ఇన్నేళ్లలో ఒక్క విదేశీ పుస్తకమైనా చదవలేకపోయానే అనుకుంది. ఐరాస గుర్తింపు పొందిన 193 దేశాలకు చెందిన ఒక్క పుస్తకమైనా చదవాలని, అది కూడా ఒక్క ఏడాదిలోనే చదవాలని సంకల్పించుకుంది. అలాంటి ఒక ఉక్కు సంకల్పం వుండాలి. జీవితాన్ని ఉత్సాహంగా గడపాలంటే... ఇంట్లో పుస్తకాలుండాలి. 'కొన్ని పుస్తకాలు రుచి చూడాలి. కొన్నింటిని మింగేయాలి. మరికొన్నింటిని నమిలి జీర్ణం చేసుకోవాలి' అంటాడు ప్రముఖ రచయిత బేకన్. పుస్తకాలు చదవడం అలవాటుగా మారాలి. ఈ పుస్తక పండుగను సద్వినియోగం చేసుకోవాలి. పిల్లలకూ అలవాటు చెయ్యాలి. సమాజంలోని అనేక రుగ్మతలకు ఇదే సరైన ఔషధం.

## ఏ.ఎమ్. రెడ్డి ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ అశోక్ రెడ్డికి పిహెచ్.డి ప్రధానోత్సవం



పల్నాడు జిల్లా నరసరావుపేట ఫిబ్రవరి 13:స్థానిక పెట్లూరి వారి పాలెం నందు గల ఏ.ఎమ్ .రెడ్డి ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు దేవిరెడ్డి అశోక్ కుమార్ రెడ్డికి శనివారం నాడు జైపూర్ నేషనల్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ ప్రధానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఎవల్యూషన్ ఆఫ్ యాంటీ ఒబిసిటీ పొటెన్షియల్ ఆఫ్ కొమ్మిపోరా ముకుల్ అండ్ కెపా రిస్ స్పైనోజ్ అనేటువంటి విషయం మీద పరిశోధనకు గాను పీహెచ్.డి పట్టా పొందినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ జి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో పని చేస్తున్నటువంటి అధ్యాపకునికి పీహెచ్డీ పట్టా రావటం శుభాపరిణామం అని ఎంతోమంది విద్యార్థులకు అశోక్ రెడ్డి ఆదర్శంగా నిలవాలని ప్రతి విద్యార్థి విషయ పరిజ్ఞానంతో పాటు పరిశోధన పరిజ్ఞానం కూడా అవసరంఅని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ శ్రీమతి అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి చాయ చిత్రం ద్వారా డాక్టర్ అశోక్ రెడ్డి పిహెచ్డి అవార్డు ప్రధానోత్సవం పట్ల అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భార్గవ్ భూషణ్ మరియు డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ లక్ష్మి సురేఖ, విభాగాధిపతి డాక్టర్ జి కిరణ్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు డాక్టర్ అశోక్ రెడ్డిని అభినందించారు.

## సప్తగిరి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



చందర్లపాడు ఫిబ్రవరి 13 ప్రజాపాలన ప్రతినిధి:మం డలపరిధిలోని కోనాయపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సప్తగిరి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ ను శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రా వు సోమవారం ప్రారంభించారుఅనంతరం ఖాతా దా రులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మె ల్యే మాట్లాడుతూ ఖాతాదారులకు అందుబాటులో ఉండే విధంగా మెరుగైన సేవలు అందిస్తూ సప్తగిరి గ్రామీణ బ్యాంక్ పలు బ్రాంచ్ లను ఏర్పాటు చేస్తూ తమ సేవలను విస్తరించడం అభినందనీయమన్నారు .ఈ కార్యక్రమంలో బ్యాంకు ఆర్.యం., మేనేజర్, స్థా నిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆటోవాలాలకు కౌన్సిలింగ్ ఇచ్చిన సీఐ కే.సతీష్



నందిగామ ఫిబ్రవరి 13 ప్రజా పాలన ప్రతినిధి: పట్ట ణంలో రామన్నపేట రోడ్డు రమణ కాలనీ చందా పు రం బైపాస్ రోడ్డు వద్ద సీఐ సతీష్ ఎస్ఐ పండు దొర ఆటో డ్రైవర్లకు మిర్చి పత్తి పొలాలకు వెళ్లే దినసరి కూలీలకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చారుమిర్చి కోత ల సమయం కావడంతో ఆటోలలో పరిమితికి మించి 20 నుండి 30 మంది కూలీలని వారి ఇంటి దగ్గర నుం చి మిర్చి పొలం వరకు రవాణా చేస్తున్నారు.ఈ సం దర్భంగా సీఐ సతీష్ మాట్లాడుతూ కూలీలు కూడా మనుషులేనని ఆటో డ్రైవర్లు లాభా ప్రేక్ష కోసం పరి మితికి మించి ఆటోలలో ఎక్కించుకోకూడదని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారుఆటోలలో 20 నుంచి 30 మంది దినసరి కూలీలను తీసుకెళ్లేటప్పుడు ఏదైనా ప్రమా దం జరిగితే అధిక సంఖ్యలో ప్రాణ నష్టం జరుగుతుం ది ఇది ఎవరు ఊహించలేరు దినసరి కూలీలు చాలా పేదవారు వారి కుటుంబంలో ఎవరినైనా కోల్పోతే వా రి కుటుంబ పరిస్థితి ఏంటి ఇలాంటి ప్రమాదాలు జర గకుండా ఉండాలంటే ఆటోలలో అనుమతి నుంచి కూలీలను ఎక్కించుకోకూడదు అని సిఐ అన్నారు మొదటిసారిగా కౌన్సిలింగ్ ఇస్తున్నామని ఇంకోసారి పరిమితి కి మించి ఆటోలలో కూలీలను రవాణా చే స్తే ఆటో డ్రైవర్ల పై కేసులు నమోదు చేస్తామని అదేవి ధంగా కూలీల కోసం ఆటోలు పంపిన పొలం యజ మానులపై కూడా కూడా చర్యలు తీసుకుంటామన్నా రు

# లోకేష్ పాదయాత్రలో ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనను ప్రకటించాలి



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి:జగన్ గడప గడపకు యాత్రలో ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్ట్ అలసత్వం పై ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పిసి )ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో ఆర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు వేడా శ్రీనివాస్ డిమాండ్ చేసారు. గత ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించి తెస్తాం అని రాష్ట్ర ప్రజలను నమ్మించి అధికారాన్ని పొందిన చంద్రబాబు గెలిచిన అనంతరం ప్రత్యేక ప్యాకేజి అన్నందుకు ఆంధ్రులు చిత్తు చిత్తుగా ఓడించిన సంగతి విదితమే అయినప్పటికీ, చంద్రబాబు స్థానంలో తనయుడు లోకేష్ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రకు పూనుకోవటం సాహసోపేతమైన నిర్ణయం కాదా ! మోది ఆంధ్రప్రదేశ్ కు ద్రోహం చేస్తున్నాడని తెలిసి చంద్రబాబు పార్టీ కేంద్రంలో బిజెపి కి భజన చేయటం ఆంధ్రులను మోసగించటం కాదా ! అని , లోకేష్ పాదయాత్రలో తన హయాంలో ఆంధ్రప్రదేశ్ కు జరిగిన ఘోర నష్టంపై ప్రజలకు ఏమని స్పష్టత ఇవ్వగలరా అని,విభజన అనంతరం ప్రజలు మీకు ఇచ్చిన అధికారాన్ని రాజకీయ కాలక్షేపంతో రాష్ట్ర అభివృద్ధిని తీవ్రంగా నష్ట పరిచారని , కలుషిత రాజకీయాలకు అధిక ప్రాధాన్యత నిచ్చి అభివృద్ధి నోచుకోని రాష్ట్రంగా ఎడారిగా మార్చారని, పాదయాత్ర ద్వారా మీకు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసినట్టు చంద్రబాబు, లోకేష్ లు అంగీకరించగలరా అని, అధికారం వున్నప్పుడు ప్రత్యేక హోదా విభజన హామీలకు ద్రోహం చేసి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని మోది రాజకీయ అవసరాలకు తాకట్టు పెట్టారని, అధికారం పోయిన తరువాత పాదయాత్రల ద్వారా ప్రజలను మరో సారి నమ్మించాలనుకోవటం చంద్రబాబు వంటి అనుభవజ్ఞులకు తగదని ఆయన హితవు పలికారు.ఆంధ్రులకు అత్యంత ఆత్మగౌరవం అయినటువంటి ప్రత్యేక హోదా, విభజన హామీలపై పవన్ కళ్యాణ్ స్పష్టత ఇవ్వాలని, వారాహి యాత్రతో ప్రజల్లోకి వస్తున్నటువంటి పవన్ కళ్యాణ్ అర మరికలు లేని విధంగా హోదా పై సూటిగా తమ వైఖరి చెప్పాలని, ఒక్క జగన్ మోహన్ రెడ్డి నే టార్గెట్ చేస్తున్న పవన్ ఉపన్యాసాల కారణంగా రాష్ట్ర సమస్యలు ప్రక్కదారి పడుతున్నాయని, ఇప్పటి వరకు పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రస్థానంలో జగన్ పార్టీ పైన ద్వేషం తప్ప అన్యాయమై పోతున్న రాష్ట్ర ప్రయోజనాలపై చిత్తశుద్ధిని పవన్ కళ్యాణ్ కనపరచటం లేదని,ఆంధ్రప్రదేశ్ కు మోది చేస్తున్న ద్రోహంను పవన్ ప్రశ్నించకుండా మోది పార్టీతో సన్నిహితంగా ఉండటం మెజార్టీ ఆంధ్రుల హృదయాన్ని దొలిచివేస్తుందని కేంద్ర ప్రభుత్వం అశాస్త్రీయమైన విభజనతో ఆంధ్రులను మోసగించిందని, పవన్ రాజకీయ నిర్మాణం అంత జగన్ పై ద్వేషమే కనపడుతుంది తప్ప మన రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై పవన్ మైత్రి బంధంతో కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురాకపోవటం బాధాకరమని, జగన్ అసమర్థత ఎంతైతే వుందో మోది ద్రోహం కూడా వంద రెట్లు వుందని పవన్ గ్రహించక పోవటం మిలియన్ టన్నుల ప్రశ్నగా మిగులుతుందని, వారాహి యాత్రలో అనేక రాష్ట్ర సమస్యలపై పవన్ వైఖరి తెలుపాలని ఆశిస్తున్నామని, సినీ నటుడిగా ఆంధ్రప్రదేశ్ లో మీకు గల అభిమాన గణం తో ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం మీరు గట్టిగా గళం వినిపించాలని పవన్ మంచి కోరే వాడిగా ఆంధ్రుల తరుపున అభ్యర్థిస్తున్నానని, ఇప్పటికి రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదేళ్ల పైనే అయ్యిందని, ఏ ఒక్క అభివృద్ధికి రాష్ట్రం నోచుకోలేదని,మీకు సామాజిక స్పృహ వుందని నమ్ముతున్నానని, అందుకే మా పార్టీ నుండి అన్యాయమైపోతున్న ఆంధ్రప్రదేశ్ కు అండగా నిలవమని మిమ్ములను కోరుతున్నామని,మీపై గల అభిమానంతో ముమ్ములకు విజ్ఞప్తి చేస్తున్నామని , మీ రాజకీయ పదానిసలలో మెరుగైన రాజకీయ సంస్కరణలకు శ్రీకారం చుట్టాలని, మీరు గెలవొచ్చు, గెలవక పోవొచ్చు ఈ చరిత్రలో మీకు ఒక మంచి స్థానం దక్కాలని ఈ సందర్భంగా మీకు సూచిస్తున్నామని,కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై ప్రత్యేక హోదా విభజన హామీలు, పోలవరం ప్రాజెక్ట్ పై ఆంధ్రప్రదేశ్ తరుపున పవన్ కళ్యాణ్ ఉగ్రరూపాన్ని చూపిస్తారని ఆయన పవన్ కళ్యాణ్ కు సూచన చేసారు. 2024 ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి ఆంధ్రప్రదేశ్ సంపదను దోచుకోవాలనే కుయుక్తులతో ప్రధాన వ్యాపార రాజకీయ పార్టీలు జ్యోతిష్యాన్ని సైతం కలుషితం చేస్తున్నారని, కిరాయి జ్యోతీష్యులతో ప్రజల దృష్టి మళ్లించే విధంగా నక్షత్రాలు, గ్రహాలు ప్రభావం అంటు అవాస్తవాలతో వ్యాపార ప్రకటనలు గుప్పిస్తున్నారని, పెద్ద పార్టీలకు అండగా నిలుస్తున్న కొన్ని కార్పొరేట్ శక్తులు జ్యోతిష్య శాస్త్రంపై కనీస అవగాహన లేని వ్యక్తులను నకిలీ జ్యోతిష్కునిగా వేష దారణలతో రూపాలు మార్చి, తర్ఫీదులు ఇచ్చి సొంత కార్పొరేట్ మీడియా వ్యవస్థల ద్వారా ఖరీదైన ప్రకటనలతో ప్రచారం సాగిస్తున్నారని, ఒక కంపెనీ తరుపు జోతీష్యుడు చంద్రబాబు, లోకేష్ లకు గ్రహాలు బాగున్నాయని, మరో జ్యోతిష్యుడు జగన్ కు అనుకూలతలు వున్నాయని, వీరి మధ్యలో ఇంకొక్క జ్యోతిష్యుడు పవన్ కళ్యాణ్ కు అదృష్ట యోగం వుందని సనాతన జ్యోతిష్య శాస్త్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని , కొంతమంది ఘనాపాటీలుగా పేరుగాంచిన వారు కూడా ప్రవచనాల ముసుగులో వ్యాపార రాజకీయ పార్టీలను ప్రోత్సహిస్తు ఆధ్యాత్మిక నేరాలను వారి ప్రసంగాల ద్వారా బలోపేతం చేస్తున్నారని,భక్తి ముసుగులో కొంతమంది రాజకీయ ఉపన్యాసాలు, ఉపమానాలు వల్లించటం బాధాకరమని, సనాతన ధర్మం గొప్పతనం కోసం,విలువైన సాంప్రదాయాల కోసం, చారిత్రిక అన్వేషణల కోసం, దైవ శక్తి ఆంతర్యం కోసం చెప్పకుండా రాజకీయ నేతలకు బంటులుగా మారి పోతున్నారని, ఖరీదైన ఆధ్యాత్మిక కేంద్రాల ద్వారా దైవాత్మక ఏకాగ్రతను కలుషితం చేస్తున్నారని, ఈ కోవలో అన్ని మత గ్రంథాల బోధకుల్లో ఇలాంటి వారు ఉండటం అత్యంత బాధాకరమని, ప్రజలు దైవ సన్నిధిలోను, ప్రాగణాల్లోను రాజకీయాలను,ఇతర వ్యాపకాలతో ఉపోద్ఘాతాలను చెప్పే చెడ్డ పండితులకు భక్తులు ఎంత దూరంగా వుంటే అంత గొప్ప దైవాశీస్సులు దక్కుతాయని ఆయన తెలిపారు.జగన్ గడప గడప యాత్రలో ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్ట్ అలసత్వంపై వివరణ ఇవ్వకుండా గడప గడపకు తిరగటం వల్ల ప్రయోజనం వుండదని,మోది ఆంధ్రప్రదేశ్ కు చేస్తున్న అన్యాయంపై జగన్ సర్కార్ కేంద్రాన్ని నిలదీయక పోవటం ప్రజా ద్రోహంగా ఆంధ్రులు భావిస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ కు చెప్పుకోవటానికి ఒక రాజధాని లేకపోవటానికి జగన్ సర్కార్ ను ప్రధాన కారణంగా భావిస్తున్నామని, ఆంధ్రప్రదేశ్ కు అద్భుతమైన రాజధాని నిర్మాణాన్ని, ప్రత్యేక హోదా విభజన హామీలను, పోలవరం ప్రాజెక్ట్ ను సాధించుకునే దిశగా ఆంధ్రులు ప్రత్యామ్నాయం రాజకీయ మార్గం ప్రోత్సహించాలని, రాష్ట్రంలో గల సహజ వనరులను, నిక్షేపాలను కాపాడుకోవాలని, సంపన్న రాష్ట్రాన్ని సాధించుకోవాలని ఆర్పిసి అధ్యక్షులు వేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డివిఆర్ మూర్తి,లంక దుర్గాప్రసాద్ , సిమ్మా దుర్గారావు, ఎండి హుస్సేన్ , వర్ధనపు శరత్ కుమార్ , మోర్త ప్రభాకర్ , వాడపల్లి జ్యోతిష్ , దోషి నిషాంత్ , మట్టపర్తి తులసి , వల్లి శ్రీనివాసరావు , వనుం శ్రీనివాసరావు , వల్లి వెంకటేష్ , గుడ్ల సాయి దుర్గా ప్రసాద్ , మండవల్లి సూరిబాబు , ముంగండ వెంకటరావు , కంచెర్ల సత్యవతి , మద్దా ప్రశాంతి , లంక వీర వెంకట సత్యనారాయణ , మద్దా రాజు, బత్తెన రమణ , పసుపురెడ్డి సంతోష్ కుమార్ పాల్గొనియున్నారు.

## చంద్రబాబుకు లోకేష్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే కేసులు పెడుతున్న ప్రభుత్వం



జగ్గంపేట ప్రజా పాలన ప్రతినిధి :కాకినాడ జిల్లా జగ్గంపేట ఫిబ్రవరి 13: జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 15, 16, 17 తేదీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా జగ్గంపేట లో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు ఎన్టీఆర్ కాంస్య విగ్రహం స్మారక మందిరం పనులు కాకినాడ రోడ్ లోని హెచ్ పి పెట్రోల్ బంక్ పక్కన కార్యకర్తల సమావేశ వేదిక ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రు జోనల్ ఇంచార్జ్ ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ మంత్రి పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ కలిసి ప్రోగ్రామ్స్ కమిటీ కోఆర్డినేటర్స్ గంటా గౌతమ్ పరుచూరి కృష్ణ, ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈనెల 15, 16, 17 తేదీల్లో చంద్రబాబు పర్యటన యధాతథంగా సాగుతుందని అందులో భాగంగా పర్యటన ఏర్పాట్లు పరిశించామని అలాగే సీనియర్ నాయకులు జ్యోతుల నెహ్రూ తన నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు 2650 మంది తో సమావేశం నిర్వహించడానికి చక్కని సభా వేదిక ఏర్పాటు చేశారని ఆహ్లాదకరంగా ఉ ందన్నారు. ఈ రాష్ట్రంలో జగన్ రాక్షస పాలన తట్టుకోలేక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నరని తెలుగుదేశం పార్టీకి చంద్రబాబుకు లోకేష్ కి వస్తున్న జనాదరణ చూసి వార్వలేని ఈ ప్రభుత్వం అనేక తప్పుడు కేసులు పెడుతూ మైకు లాక్కోవడం వాహనాలు సీజ్ చేయడం చీకటి జీవోలు తీసుకొస్తుందని అయినా ప్రజా మద్దతుతో అన్ని కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేసుకుని ముందుకెళ్తున్నామని అన్నారు. మూడు రోజుల చంద్రబాబు పర్యటన ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, సుంకవిల్లి రాజారావు( రాజు), దాపర్తి సీతారామయ్య, ఎస్వీ ప్రసాద్, మండపాక అప్పన్న దొర, వైభోగుల కొండబాబు యాదవ్, కురుమళ్ళ నాగేశ్వరరావు దేగల సత్తిబాబు, మానేపల్లి సాయి నలమాటి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## కుమరదేవంలో పురాతన హరిహర క్షేత్రాన్ని దర్శించుకున్న ఆలయ నిర్మాణ దాతల వారసులు



కొవ్వూరు ప్రజాపాలన ప్రతినిధి: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమరదేవం లో సుమారు 350 సంవత్సరాల క్రిందట నిర్మించిన హరిహర క్షేత్రముల నిర్మాణ దాత అయినటువంటి బ్రహ్మశ్రీ వేలూరు వెంకట్రామయ్యపూర్ణ సత్యమూర్తి, అన్నపూర్ణమ్మ దంపతులువారికి ఇద్దరు అబ్బాయిలుపెద్దబ్బాయి శ్రీ వేలూరి లక్ష్మీనరసింహ వెంకట్రామయ్యయ్య ,మరియు వేలూరి సోమయాజులు. వీరి సంతతిలో కొందరు విదేశాల్లోస్థిరపడినారు,మరికొందరు దేశం నలుమూలల స్థిరపడ్డారు,కొందరు రాజమహేంద్రవరంఉన్నారు అయితే మనవులు,ముదిమనవలు తమ ముత్తాత నిర్మించిన ఆలయం కుమరదేవం లో ఉందని,అక్కడికి వెళ్లి దర్శనం చేసుకుని తరించాలి అని అనుకోని ఈరోజు కుమారుదేవం గ్రామానికివచ్చారు, అర్చకులు వారికి స్వాగతం పలికి, పూజాకార్యక్రమాలు నిర్వహించారు,పూర్ణ సత్యనారాయణ మూర్తి యొక్క సంతతి అనగా మనవులు మునిమనవలు అందరూ గ్రామానికి వచ్చి స్వామివార్లను ,అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి.ఆలయం బాగోగులుగురించి అర్చకులు,ఆలయ కార్యదర్శని,ఆలయ చైర్మన్లను అడిగి తెలుసుకున్నారు.

## చంద్రబాబును ముఖ్య మంత్రి చేయడమే ధ్యేయం: టిడిపి నరసరావుపేట ఇంచార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు



పల్నాడు జిల్లా .నరసరావుపేట. ఫిబ్రవరి 13 (ప్రజా పాలన ప్రతినిధి) :చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడమే నాయకులు కార్యకర్తల ధ్యేయం అని నరసరావుపేట తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ చదరవర అరవింద్ బాబు అన్నారు. పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి గుంటూరు జిల్లా కుమ్మర శాలివాహన సాధికార సమితి నాయకుల ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక సందర్భంగా ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన టీడీపీ కుమ్మర శాలివాహన సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మరియు ఎ.పి.కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర కోశాధికారి మదనాపు పోతులయ్య, నరసరావుపేట తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పాల్గొన్నారు. ఈ సంద్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు అన్న ఎన్టీ రామారావు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తెలుగుదేశం పార్టీలో ఉన్నతమైన స్థానాలు ఇచ్చారని అదేవిధంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు అచ్చంనాయుడు, రాష్ట్ర బీసీ సాధికార సమితి అధ్యక్షులు కొల్లు రవీంద్ర ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ సాధికార సమితి కమిటీలను ఏర్పాటు చేసి అట్టడుగునున్న బీసీ కులాలకు సంబంధించిన స్థితిగతులను తెలుసుకోవడానికి బీసీ సాధికార సమితి ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో భాగంగా సోమవారం కుమ్మర శాలివాహన కులానికి సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, రాష్ట్రంలోనే మొదటిసారి పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేయటం శు భ పరిణాయమని అన్నారు. ఈ కమిటీ సభ్యులు అందరూ కూడా శక్తివంచనమేరకు పార్టీ కోసం పని చేసి, పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని, రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి, గొట్టిపాటి జనార్దన్ బాబు, రాష్ట్ర కుమ్మర శాలివాహన సాధికార సమితి మీడియా కోఆర్డినేటర్ నడికుడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమటీ సభ్యులు మోదుగుల చంద్రశేఖర్, పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కొట్ట కిరణ్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కుమ్మర శాలివాహన సాధికార సమితి నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఓణిల ఫంక్షన్లో పాల్గొన్న వైసీపీ మండల నాయకులు..



ఉండి, ప్రజాపాలన ప్రతినిధి:మండలంలోని పాందువ్వ గ్రామంలో మాజీ సర్పంచ్,వైసీపీ గ్రామ అధ్యక్షులు అల్లూరి వెంకట రామరాజు (రాంబాబు)మనువరాలి ఓణిల ఫంక్షన్ ఓ పండుగల రామరాజు జరిపించారు.ముఖ్య అతిధులుగా హాజరైన జెడ్పీటీసీ సభ్యులు రనాస్తుల కనకదుర్గ మహంకాళి,మండల నాయకులు ఏడిద వెంకటేశ్వరరావు, గళవిల్లి ధనుంజయ,ఆరేడు ఆలమూరి క్రిష్ణ అక్షింతలు వేసి వారి ఆశీస్సులు పాపకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెన్మేత్స వెంకట సుబ్బరాజు,నరసింహరాజు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాందువ్వ గ్రామ సహాయ కార్యదర్శి తమ్మినేని యువసేన ప్రతినిధి అరివెల్లి బలరాముడు, దవిలి అప్పన్న, తాండ్ర రాంబాబు,పెల్లూరి అప్పన్న, కోమలపల్లి నారాయణ మరియు పలువురు నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామ ప్రజలు పాల్గొని వారి వారి ఆశీస్సులు ఆ పాపకు అందించడం జరిగింది.

## అత్యంత అవసరమైన అంశాలకు రాజకేయపార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలి: డాక్టర్ సీపాన.గుణవతి



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రంలో ప్రజలకు అత్యంత అవసరమైన విద్యా, ఆరోగ్యం, వ్యవసాయం, రవాణా, పౌష్టికాహారం వంటి అంశాలకు రాజకేయపార్టీలు అధిక ప్రధాన్యత ఇవ్వవలసి ఉందని ఆదివారం చేసిన పత్రికా ప్రకటనలో సమాజ సేవకురాలు,సంఘసేవలో డాక్టరేట్ గ్రహీత డాక్టర్ సీపాన.గుణవతిఅన్నారు. ఈ సారి ఎన్నికల్లో కొత్తగా ఆవిర్భవించిన పార్టీలు పై అంశాలపై దృష్టి పెట్టడం అవసరమని తెలిపారు.ఏ ప్రభుత్వాలైనా రాజ్యాంగం ద్వారా ప్రజలకు సంక్రమించిన హక్కులను కాపాడటానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె గుర్తు చేశారు. సామాన్య ప్రజలకు న్యాయ సహకారం అందించటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని.ఈ చర్యలు మానవ హక్కుల ఉల్లంఘనకు దారి చూపుతుందని డాక్టర్ గుణవతి ఆవేదన వ్యక్తపరిచారు. ప్రజలకు ఉచిత పథకాలు కంటే న్యాయ సహకారం,అధికారుల సేవలు చాలా అవసరమని ఆమె అన్నారు.రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో గిరిజనుల భూములను గిరిజనే తరులు అనుభవిస్తున్నా అధికారులు తెలిసి కూడా వారికి న్యాయం చేయకపోవడం పట్ల విచారం వ్యక్తపరిచారు. రాష్ట్రంలో అనేక మారుమూల ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు కల్పించటంలో కూడా అధికారులు విపలమౌతున్నారు. గిరిజనులు తమ ఉత్పత్తులను అమ్ముకోవటంలో దళారీ చేతుల్లో మోసపోతున్నారని,వీరి అభివృద్ధుకి రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంత్రులు,అధికారులు ఏమి చేస్తున్నారో కూడా ప్రజలకు అర్ధం కావటం లేదని ఆమె ఆవేదన వ్యక్తపరిచారు.రాష్ట్రంలో రాజకీయపార్టీలు అధికారం చేపట్టిన తరువాత ప్రజల చట్ట పరమైన హక్కులు కాపాడటానికి అధిక ప్రాధాన్యత నువ్వాలని డాక్టర్ గుణవతి కోరారు .

## బాలుని వైద్యానికి అభయం సేవాసంఘం రూ.38000 ఆర్థిక సాయం

**ధాతల ఔదార్యానికి కృతజ్ఞతలు తెలియజేసిన అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు**



టెక్కలి ప్రజాపాలన ప్రతినిధి:ఎన్టీఆర్ నగర్ 16వ లైన్ లో నివాసం ఉంటున్న లాల్ పండా వెంకటరావు, శాంతి దంపతులకు ఇద్దరు కుమారులు వాళ్ళ లో చిన్నవాడు లాల్ పండా కార్తీక్ (4) సోజియ అనే వింత వ్యాధితో బాధపడుతున్నాడు. పిల్లాడికి ప్రతి నెల 18000 విలువ చేసే ఇంజెక్షన్ వేస్తే సాధారణ పిల్లాడి వలే నడవగలడు, లేకపోతే శరీర ఉష్ణోగ్రత పెరిగిపోయి, ఒళ్ళు నొప్పులతో మంచానికే పరిమితమైపోతాడు. తండ్రి గ్రానేటు కార్మికునిగా పనిచేస్తూ , ఉన్న చిన్న ఇల్లు కూడా అమ్మేసి కుమారుని వైద్యం కోసం ఖర్చు చేశారు. ప్రస్తుతం చేతిలో చిల్లి గవ్వకూడా లేక పిల్లాడికి మందులు కొనడానికి కూడా డబ్బులు లేక దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలుసుకున్న అభయం యువజన సేవాసంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు వెంటనే స్పందించి తమ సేవాసంఘం గ్రూప్ లో ఈ బాలుని వైద్యానికి సహాయం చేయమని కోరగా సభ్యులందరు స్పందించి చేతనైన సాయం అందించారు, ముఖ్యంగా డాక్టర్ లింగాల రమేష్ గారు 5000, డాక్టర్ అన్నెపు వినోద్ గారు 5000, సైంటిస్ట్ కె వి ఎస్ కె అప్పారావు గారు 5000, అందవరపు కిషోర్ గారు 5000, తేజ రెస్టారెంట్ రమేష్ గారు 5000 ఇలా దాతలందరి సహకారం తో 38000 రూపాయల ఆర్థిక సహాయం ను బాలుని తల్లి లాల్ పండా శాంతి కి అందజేసినట్లు అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాసంఘం పిలుపు మేరకు స్పందించిన ప్రతి దాతకు అభయం సేవాసంఘం తరుపున ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అభయం యువజన సేవాసంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు తో పాటు సంఘ సభ్యులు డాక్టర్ వినోద్ , యన్ సింహాచలం, ఇంటూరి రమేష్, కోరాడ నాగరాజు, బోయిన నాగరాజు, షణ్ముఖ మాస్టారు, డి పూర్ణాచారి, యస్ జీవన్, దున్న శ్రీను, యమ్ దుర్గారావు, బి చంద్రకాంత్, మున్నా పాల్గొన్నారు.

## మద్దుల రాంబాబు,అన్నపూర్ణ దంపతులు వితరణతో వారధి ట్రస్ట్ 19వ సైకిల్ పంపిణీ



ఏలూరు జిల్లా,జంగారెడ్డిగూడెం ప్రజాపాలన ప్రతినిధి: ఇందిరానగర్ కాలనీ లో వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల బాలికా విద్యా ప్రోత్సాహక సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టి విజయవంతంగా 18 సైకిళ్లు లక్ష్యం పూర్తిచేసుకున్న క్రమంలో దాతల నుండి లభించిన అనూహ్య స్పందనతో పాఠశాలలకు సుదూర ప్రాంతాల నుండి వెళ్లి వచ్చే పట్టణంలోని ఇతర ప్రాంతాల్లో వారధి ట్రస్ట్ ద్వారా గుర్తించి ఎంపిక చేయబడ్డ లబ్ధికి అర్హులైన నిరుపేద కుటుంబాలకు చెందిన వారు మరియు దురదృష్టవశాత్తు తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలు ,బంధువుల సంరక్షణలో ఉంటూ సైకిల్ అవసరం కలిగిన మరికొద్ది మందితో పాటు దాతలే స్వయంగా ఎంపిక చేసుకున్న బాలికలకు వారధి ట్రస్ట్ కు అండగా నిలిచే మరికొద్ది మంది దాతల తోడ్పాటుతో సైక్లిళ్ళు పంపిణీ కొనసాగిస్తున్నట్టు వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ ప్రకటించారు.ఆదివారం ఉదయం ఇందిరానగర్ కాలనీ లో కొలువైయున్న శ్రీఅభయాంజనేయస్వామి వారి దివ్యసన్నిధిలో వారధి ట్రస్ట్ ద్వారా పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త,సింహాద్రి మొబైల్ వరల్డ్ అధినేత మద్దుల రాంబాబు,అన్నపూర్ణ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి వితరణతో సైకిల్ పంపిణీ చేసే కార్యక్రమం వలవల తాతాజీ నిర్వహణలో జరిగింది. మద్దుల రాంబాబు,అన్నపూర్ణ దంపతులు ముందుగా శ్రీఅభయాంజనేయస్వామి వారికి పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న ఉసిరిక లక్ష్మీ తులసి అనే బుట్టాయగూడెం రోడ్ లో నివాసం ఉండే బాలికకు సైకిల్ ను పంపిణీ చేయడం ద్వారా మొత్తంగా వారధి నుండి 19 వ సైకిల్ పంపిణీ చేయడం జరిగింది. దాత మద్దుల రాంబాబు మాట్లాడుతూ తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా బాలికా విద్యను ప్రోత్సయిస్తూ వలవల తాతాజీ చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగస్వాములవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని శుభసందర్భం సేవ రూపంలో జరుపుకునే అవకాశం దొరకడం తృప్తిని ఇచ్చిందని,వారధి ట్రస్ట్ మరియు తాతాజీ సేవలను అభినందించారు. సామాజికవేత్త ధనకుమార్ మాట్లాడుతూ దాతల మద్దతు తో వారధి ట్రస్ట్ మరింతగా ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మద్దిపాటి శ్రీను,కలపాల శ్రీనివాస్,బాలిక కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి నగరూరు రాఘవేంద్ర విజయానికి కృషి చేయాలి: సాయిలోకేష్



అన్నమయ్య జిల్లా : ప్రజాపాలన ప్రతినిధి: చిట్వేలి మండల కేంద్రం లోని బిజెపి కార్యవర్గ సమావేశం మండల పరిధిలోని నాగవరం పంచాయతీ వడ్డిపల్లి గ్రామంలో మండల బిజెపి ప్రధాన కార్యదర్శి బాబుజి, బిజెపి సీనియర్ నాయకులు జగదాబి ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర పొలిటికల్ ఫీడ్ బ్యాక్ కమిటీ మెంబర్ సాయిలోకేష్ మరియు పార్టీ పరిశీలకులు జిల్లా ప్రధాన కార్యదర్శి వై సురేష్ రాజు హాజరయ్యారు ఈ సందర్భంగా సాయిలోకేష్ మాట్లాడుతూ చిట్వేలి మండలంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థి నగరూరు రాఘవేంద్ర విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని, మండలంలో ఎటువంటి సమస్య అయినా పరిష్కరించేందుకు మండల శాఖ తీసుకునే నిర్ణయాన్ని ఏ స్థాయిలో అయినా ఒత్తిడి చేసి అవసరమైతే ప్రజా పోరాటాల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తానని మండల నాయకులు, కార్యకర్తలు సంపూర్ణ విశ్వాసంతో పనిచేయాలని ఉద్బోధించారు . ఈ నెలాఖరులో జరిగే మన్ కి బాత్ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యులుతొంబరపు సుబ్బరాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు వాకచర్ల సుబ్బారావు , మండల బిజెపి సీనియర్ నాయకులు జగదాబి ప్రసాద్ రాజు, మండల బిజెపిసీనియర్ నాయకులు మాధవయ్య గౌడ్ , నీలం కృష్ణయ్య, యువ నాయకులు రాము ,సుధీర్ ,మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ జెండా భుజాన మోసే ప్రతి కార్యకర్తను జనసేన విస్మరించదు: తుమ్మల ప్రసాద్



బుచ్చి మండలం ప్రజాపాలన ప్రతినిధి: :జనసేన పార్టీ క్రియాశీలక బుచ్చి మండల ఉపాధ్యక్షులు తుమ్మల ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరే జనసేన క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ పార్టీ జెండా భుజాన మోసే ప్రతి కార్యకర్తల సంకల్పం పట్టిదలను జనసేన ఏనాడు విస్మరించదని అన్నారు.పవన్ కళ్యాణ్ జనసేన కార్యకర్తలను ప్రాణప్రదంగా చూసుకుంటారనే దానికి నిదర్శనం ఈ జనసేన క్రియాశీలక సభ్యత్వం అని అన్నారు.చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఏ రాజకీయ పార్టీ తీసుకొని నిర్ణయం జనసేన పార్టీ తీసుకుంది అని అదే క్రియాశీలక పార్టీ క్రియాశీలక సభ్యత్వం అని తెలియజేశారు.500 రూపాయలు కట్టి సభ్యత్వం తీసుకున్నా పవన్ కళ్యాణ్ గత సంవత్సరం అదనంగా రెండు కోట్ల రూపాయలు తన సంపాదన నుంచి వెచ్చించి కార్యకర్తల కు భరోసా గా నిలిచారని అన్నారు.జనసేన నాయకులు,కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు జనసేన క్రియాశీలక సభ్యత్వం గురించి వివరించి అందరినీ సభ్యులుగా చేర్పించవలసిందిగా బాధ్యత తీసుకోండి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సురేష్, అభిలాష్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు

## జనం కోసం జనసేన "పల్లె పల్లెకు.. జనసేన"



బుచ్చి మండలం : ప్రజాపాలన ప్రతినిధి:బుచ్చిరెడ్డి పాలెం దామరమడుగు గ్రామంలో స్థానిక జనసైనికుడు చరణ్ అధ్వర్యంలో అధ్యక్షుడు దేవూరి మాధవ్, ఉపాధ్యక్షుడు తుమ్మల ప్రసాద్ "పల్లెపల్లెకు జనసేన" కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి జనసేనపార్టీ గురించి పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రజాక్షేత్రంలో సమస్యలపై చేస్తున్న పోరాటాలను వివరించారు. ఈ సందర్భంగా రైతు సంక్షేమం కోసం ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు 1,00,000 .00 ఆర్థిక సహాయం గురించి ప్రజలకు వివరించడం జరిగింది,అలాగే గ్రామంలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జనసేన పార్టీని ప్రజల్లో నుంచి పుట్టిన పార్టీ అని ఆదరించాలని కోరారు, ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను , సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారం కొరకు కృషి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో,ఉపాధ్యక్షుడు తుమ్మల ప్రసాద్, సుదీర్,సాయి,మురళి, సురేష్,కృష్ణాసాయి,సురేంద్ర, నాయబ్,సుబ్బు, జనత్,రాజేష్,బన్నీ, ప్రహర్ష మరియు జనసైనికులు పాల్గొన్నారు

## 23-24 సేవాసంవత్సరం కార్యదర్శిగా బవిరిశెట్టి హనుమాన్ తిలక్ ఎంపిక



జంగారెడ్డిగూడెం ప్రజాపాలన ప్రతినిధి:రాబోయే 23-24 సేవాసంవత్సరం కార్యదర్శిగా స్థానిక మురళీ పెట్ వరల్డ్ అధినేత బవిరిశెట్టి హనుమాన్ తిలక్ ను కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు రోటరీ జంగారెడ్డిగూడెం అధ్యక్షులు దాకారపు కృష్ణ ప్రకటించారు. కార్యదర్శి వూడా రాంగోపాల్(గోపీ) నిర్వహణలో స్థానిక శ్రీమల్లాది సీతారామలింగేశ్వరరావు రోటరీ కమ్యూనిటీ హాల్ లో దాకారపు కృష్ణ అధ్యక్షతన రోటరీ సర్వసభ్యసమావేశం ఆదివారం ఉదయం జరిగింది. దాకారపు కృష్ణ మాట్లాడుతూ 23-24 సంవత్సరం అధ్యక్షునిగా ఇప్పటికే రొంగల దేవీప్రసాద్ ను ఎంపిక చేసిన కార్యవర్గం కార్యదర్శి స్థానానికి బవిరిశెట్టి హనుమాన్ తిలక్ ను ఎంపికచేయడం ద్వారా జులై 1,2023 నుండి జూన్ 30,2024 వరకూ వీరి సారధ్యంలో రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహించనుందని తెలిపారు. చార్టర్ సెక్రటరీ మల్లాది సీతారామారావు(ఎం ఎస్ ఆర్) మాట్లాడుతూ రోటరీ ద్వారా సమాజానికి ఇతోధికంగా సేవ చేసే క్రమంలో వీరి నాయకత్వంకు సంపూర్ణ సహకారం సభ్యుల నుండి లభిస్తుందని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గణిత ఆనంద ప్రసాద్,ధనకుమార్ అయినపర్తి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలి



. చిత్తూరు జిల్లా : ప్రజాపాలన ప్రతినిధి: ఆశ వర్కర్స్ యూనియన్ చిత్తూరు జిల్లా నాలుగవ జిల్లా మాసభలు నగరిలోని రాఘవేంద్ర కళ్యాణ్ మండపంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు చందా మరి అధ్యక్షతన జరిగింది , ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆశ వర్కర్స్ అధ్యక్ష కార్యదర్శులు సుహాసిని శాంతి ఏ ఐ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ గ్రామం నిరంతరం గ్రామస్థాయిలో ప్రజలున్నయ అనారోగ్యాల గురి కాకుండా చైతన్య పరుస్తూ నవజాతి శిశువు గర్భవతులు పట్టణంలో కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు, ప్రభుత్వాలు మాత్రం ఆశా కార్యకర్తల సమస్యలు పట్టించుకోవడంలో విఫలం చెందుతున్నారు. ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మాజీ అధ్యక్షరాలు సుజాత జిల్లా కార్యదర్శులు సలీనా చందామరై ఏ ఐ టి యు సి జిల్లా నాయకులు వేలం భాష చంద్రబాబు, మోహన్ పరిమళ నవోమి నాయకులు గీత, మాధవి, ఉషా, మాధవి పవిత్ర అరుణ సుకన్య చిట్టెమ్మ వీణ రాజి శాంతి లక్ష్మి భువనేశ్వరి కార్యకర్తలఆశాకార్యకర్తలు పాల్గొన్నారు

## ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించండి

**జిల్లా నేత జయప్రకాష్ డిమాండ్**



హైదరాబాద్: ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ లో పనిచేస్తున్న ఉద్యోగులపై పనిభారం పెరిగిందని,ఉన్నతాధికారుల ఒత్తిడి సహించేది లేదని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జోగులాంబ గద్వాల జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాశ్ చెప్పారు. కరోన కష్టకాలం లో కూడా ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని పనిచేశారని ఆయనఅన్నారు.అధికారులు ప్రతి పనికి ఉద్యోగులను వేదించడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. కరోనా టైమ్ లో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేసిన వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు అడిషనల్ అలవెన్స్ లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులందరిని పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ లో సాక్షాత్తు రాష్ట్ర ముఖ్య మంత్రి కె సి ఆర్ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ప్రకటన చేశారని ఆయన గుర్తు చేశారు. కానీ నేటి వరకు వారిని పర్మినెంట్ చేయకపోవడం శోచనీయం అని ఆయన అన్నారు.

## భూకంప సహాయార్ధం ర్యాలీ విజయవంతం




విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి:రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, జెసిఐ మరియు కొన్ని స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో టర్కీ, సిరియా భూకంప బాధితుల సహాయార్ధం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లోబల్ రీచ్ ఫౌండేషన్ అధ్యక్షులు డా.రమేష్ నాథ్ లింగుట్ల మాట్లాడుతూ టర్కీ దేశం భూకంప బారినపడి ఎంతోమంది ప్రజల ప్రాణాలు కోల్పోయారని లక్షలాదిమంది గాయపడ్డారని వారికి తమవంతు సహాయం చేయాలనీ ఉద్దేశం అన్ని అంతర్జాతీయ సేవా సంస్థలను ఒకేతాటి పై నిలబడి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఫ్రూట్స్, జ్యూస్‌లు ఏవి ఆరోగ్యానికి మంచిది?

ఫ్రూట్స్ తింటే మంచిదా? లేక జ్యూస్‌లా? వీటిల్లో ఆరోగ్యానికి ఏవి మేలు చేస్తాయి? వంటి ప్రశ్నలకు వైద్యులు ఏమి చెబుతున్నారో తెలుసుకుందామా..

– పండ్లు, జ్యూస్‌లు ఏవైనా ఆరోగ్యానికి మంచిదే అని వైద్యులు చెబుతున్నారు. తాజా పండ్లను తీసుకుంటే అజీర్తి సమస్యను నియంత్రించుకోవచ్చు. పండ్లను కాకుండా జ్యూస్ తాగినా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జ్యూస్‌లు అధిక బరువు తగ్గేందుకు సహాయపడతాయి. ఫ్రూట్స్, జ్యూస్‌లు ఏవైనా సరే.. రోజూ తీసుకుంటే దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయని వైద్యులు చెబుతున్నారు.

– ఫ్రూట్స్‌లో న్యూట్రియంట్స్, యాంటీఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. జ్యూస్‌ల్ని ప్రత్యేకంగా షుగర్‌ని కలిపి తయారుచేస్తారు. వీటిని తాగిన తర్వాత కొద్దిసేపటివరకు వేటినీ తినలేరు. దీంతో అధిక బరువు ఉన్నవారు వీటిని రోజూ తాగితే.. వారు బరువు తగ్గేందుకు ఇవి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు అంటున్నారు. ఫ్రూట్స్‌తోపాటు, జ్యూస్‌ల్లో చక్కెరను కలపడం వల్ల షుగర్‌స్థాయిలు పెరిగే అవకాశముంది. అందుకే మధుమేహస్తులు జ్యూస్‌లు తాగాలనుకుంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

– మీరు రోజూ ఒక్క ఫ్రూట్‌తోనే లేక.. రెండు మూడు రకాల పండ్లను కలిపి జ్యూస్‌గా చేసుకుని తాగితే ఆరోగ్యానికి మంచిదిదే. కానీ ఫ్రెష్ జ్యూస్ తాగాలనుకునేవారు చక్కెరని కలపకుండా తాగితే ఆరోగ్యానికెంతో మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఫ్రూట్ సలాడ్‌ని కూడా మీ ఆహారంలో భాగం చేసుకుంటే అనారోగ్యాలు దరికి చేరవని డాక్టర్లు చెబుతున్నారు.

# మధుమేహులు ప్రయాణాల్లో.. వీటిని తినడం ఉత్తమం.. అవేంటంటే..?



మధుమేహంతో ఇబ్బంది పడుతున్నవారు తమ ఆరోగ్యాన్ని చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. మధుమేహంతో కలిగే ఆరోగ్యకర సమస్యలను తగ్గించుకునేందుకు ఆరోగ్యకరమైన ఆహారాలను తీసుకోవడం చాలా ముఖ్యం. అందులోనూ ప్రయాణాల్లో డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. బయట తమకు అవసరమైన ఫుడ్ దొరకనందున ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందుకని ప్రయాణానికి ముందే ఆహారం ప్లాన్ చేసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహార ప్రత్యామ్నాయాలను ప్యాక్ సిద్ధంగా పెట్టుకోవాలి.

బాదం పప్పు

బాదంపప్పులు ఆరోగ్యకరమైనవే కాకుండా ప్రయాణాల్లో సులభంగా తీసుకెళ్లేందుకు వీలుంటుంది. ఇవి డైటరీ ఫైబర్, విటమిన్ ఈ, మెగ్నీషియం కలిగి ఉండి మంచి పోషకాలను అందిస్తాయి. ఆకలిగా అనిపించినప్పుడల్లా వీటిని తినవచ్చు.

కోడిగుడ్డు

ప్రయాణాల్లో ఆరోగ్యకరమైన ఆహారం కోసం కోడిగుడ్లు చాలా ప్రయోజనకారి. బాగా ఉడికించిన గుడ్లను తీసుకెళ్లి తినాలి. ఇవి ఎక్కువసేపు కడుపు నిండుగా ఉండేందుకు, ఆకలి బాధలను తగ్గించడానికి సహాయపడతాయి.

తాజా పండ్లు

ప్రయాణించేటప్పుడు అరటిపండ్లు, కివీలు, యాపిల్స్, పియర్స్ మొదలైన తాజా పండ్లను వెంట తీసుకెళ్లవచ్చు. శక్తిని పెంచుకోవడానికి ఈ పండ్లను తింటూ ఉండాలి. అయితే, ముక్కలుగా కోసి బయట విక్రయించే పండ్లను తినకుండా ఉండటం శ్రేయస్కరం.

రా వెజిటేబుల్స్

దోసకాయ, క్యారెట్ వంటి పచ్చి కూరగాయలను ప్రయాణించేటప్పుడు వెంట తీసుకెళ్లండి. వీలున్నప్పుడు వీటిని తింటూ ఉండాలి.

పెరుగు

మధుమేహం ఉన్నవారికి పెరుగు ఒక ఆరోగ్యకరమైన ఎంపిక. ఇందులో ప్రోటీన్, విటమిన్ డీ, ఫైబర్, కాల్షియం ఉండి పోషకాలు అందిస్తాయి. ప్రయాణం చేసేటప్పుడు బ్యాగులో పెరుగు ప్యాకెట్స్ ఉండేలా చూసుకోవడం చాలా మంచిది.

పాప్‌కార్న్

పాప్‌కార్న్ రుచికరమైనవే కాకుండా ఆరోగ్యకరమైనవి కూడా. వీటిలో క్యాలరీలు తక్కువగా ఉంటున్నందున ఎక్కువ గంటలు రైళ్లలో లేదా విమానాల్లో కూర్చుని ప్రయాణం చేసే సమయాల్లో పాప్‌కార్న్ తినడం చాలా మంచిది.

చివరగా..

అయితే, ప్రయాణాలు చేసే సమయంలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవద్దు. ప్యాకేజ్డ్ స్నాక్స్ తీసుకోవద్దు. కృత్రిమ చక్కెరలు ఉండే పానీయాలు, డ్రింక్స్ తాగకుండా చూసుకోవాలి.

## డిజిటల్ ఐ స్ట్రెయిన్ బారిన పడ్డారా..? ఈ చిట్కాలు పాటించి నివారించుకోండి..!



ప్రస్తుత రోజుల్లో అన్ని ఉద్యోగాల్లో కంప్యూటర్లపై ఎక్కువ సమయం పనిచేయాల్సి వస్తున్నది. వీటికి తోడు మొబైల్ ఫోన్ల వాడకం విపరీతంగా పెరిగిపోవడంతో కంటి సమస్యలు పెరిగిపోతున్నాయి. ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌పై పనిచేయడం వల్ల కంటికి వచ్చే సమస్యలనే డిజిటల్ ఐ స్ట్రెయిన్ అని పిలుస్తారు. కంప్యూటర్ల ముందు ఏకబిగిన 2 గంటల కన్నా ఎక్కువ సమయం గడిపే వారికి ఈ సమస్య బారిన పడే ప్రమాదం ఉంటుంది. కళ్లు త్వరగా అలసిపోవడం, కంటి నుంచి నీరు కారడం, మంటగా ఉండటం, కళ్లు ఎరుపుగా మారడం, మసక దృష్టి, కళ్లు వణకడం వంటి లక్షణాలతో డిజిటల్ ఐ స్ట్రెయిన్ బారిన పడినట్లు గుర్తించవచ్చు. వీటితో పాటు తలనొప్పి, మెడ, భుజం నొప్పులు వంటివి కూడా డిజిటల్ ఐ స్ట్రెయిన్‌కు గురైనట్లు తెలిపే లక్షణాలుగా గుర్తించాలి. ఎక్కువ సమయం పాటు కంప్యూటర్‌పై పనిచేసే వారి కంటి చూపు మసకబారడం మొదలవుతుంది. తెరపై కనిపించే వస్తువులు రెండుగా కనిపిస్తాయి.

నివారణ చిట్కాలు..

తరచుగా విరామాలు తీసుకోవడం..

ల్యాప్‌టాప్‌పై పని చేస్తున్నప్పుడు మధ్యమధ్య విరామం తీసుకోవడం చాలా ముఖ్యం. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి విరామం తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. కళ్ళలో ఒత్తిడిని తగ్గించడానికి కొద్ది దూరంలోని వస్తువులను చూడాలి. పని మధ్య విరామాలు తీసుకునేటప్పుడు ఫోన్‌లను ఉపయోగించడం మానుకోవడం మంచిది. పనిచేస్తున్నప్పుడు తరచుగా రెప్పవేస్తూ ఉండాలి. ఎక్కువసేపు స్క్రీన్ వైపు చూడకుండా ఉండాలి.

నిత్యం వ్యాయామం చేయడం..

క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు మనకు తెలుసిందే. వ్యాయామం కళ్ళతో సహా శరీరంలో రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సాయపడుతుంది. అందువలన నిత్యం వ్యాయామం చేయడం వలన కళ్ల ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

సరైన కూర్చునే భంగిమ..

ల్యాప్‌టాప్‌లను ఉపయోగిస్తున్నప్పుడు కూర్చునే భంగిమ సరైన విధంగా ఉండేలా చూసుకోవాలి. పడుకొని ఉండకుండా చూసుకోవాఇ. ఇది కంటికి ఒత్తిడిని కలిగిస్తుంది. అలాగే వెన్నునొప్పికి కూడా దారితీస్తుంది. ల్యాప్‌టాప్ స్క్రీన్ ముఖానికి కనీసం 25 అంగుళాల దూరంలో ఉండేలా చూసుకోవడం చాలా ముఖ్యం.

కృత్రిమ కన్నీళ్ల వాడకం..

పొడి లేదా ఎరుపు కళ్ళ సమస్యను కలిగి ఉన్నప్పుడు కళ్ళు ఉపశమనం పొందడానికి కృత్రిమ కంటి చుక్కలను ఉపయోగించవచ్చు.

తగినంత కాంతి ఇవ్వడం..

చీకటి వాతావరణంలో ల్యాప్‌టాప్‌పై పని చేయకుండా చూసుకోవాలి. చీకట్లో ఇలాచేయడం వల్ల కళ్ళ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. కళ్ళపై ఒత్తిడి పడకుండా ఉండటానికి ప్రకాశవంతమైన కాంతి ఉండేలా చూసుకోవాలి. స్క్రీన్ కాంట్రాస్ట్, స్క్రీన్ టెక్స్ట్ పరిమాణాన్ని పెంచుకోవచ్చు.

తరచుగా కంటి పరీక్షలు..

కంటి ఆరోగ్య సమస్యలను నివారించుకునేందుకు కళ్ళను తరచుగా తనిఖీ చేయించుకోవాలి. ఇది దృష్టి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఏవైనా ఇతర కంటి సమస్యలను గుర్తించడంలో కూడా సహాయపడుతుంది.

స్క్రీన్ వల్ల కలిగే నష్టం నుంచి కళ్ళను రక్షించుకోవడానికి కంప్యూటర్ గ్లాసెస్ ఉపయోగించవచ్చు. కళ్ళకు విశ్రాంతిని అందించడానికి కళ్ళ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని చేతులతో రుద్దుతూ మసాజ్ చేసుకోవాలి. చల్లటి నీరుతో ముఖం కడుక్కోవడం వల్ల కూడా కంటిపై ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

## బర్త్ కంట్రోల్ పిల్స్ వాడుతున్నారా..? సైడ్ ఎఫెక్ట్స్ తెలుసుకోండి..!



గర్భం రాకుండా చూసుకోవడానికి చాలా మంది మహిళలు గర్భనిరోధక మాత్రలు తీసుకోవడం మనకు తెలిసిందే. పిల్లలు వద్దనుకునే వారు బర్త్ కంట్రోల్ పిల్స్ తీసకుంటున్నారు. గర్భనిరోధక మాత్రలో ఒక మాదిరి సింథటిక్ ఈస్ట్రోజన్, ఎథినిల్ ఈస్ట్రడియాల్, ప్రొజెస్టెరాన్ ఉంటాయి. ఎథినిల్ ఈస్ట్రాడియాల్ ప్రతి నెల గర్భాశయంలో అండం పెరగకుండా ఆపుతుంది. ఇది తాత్కాలిక పద్ధతే. ఒక రకంగా వీటితో ప్రయోజనాలు ఉన్నప్పటికీ వీటి వాడకంతో పలు సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయని నిపుణులు సెలవిస్తున్నారు. బర్త్ కంట్రోల్ పిల్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలుసుకున్న తర్వాతనే ఈ పిల్స్ వాడితే మహిళలు తమ ఆరోగ్యాన్ని మరింతగా కాపాడుకోగలుగుతారని చెప్తున్నారు.

వికారం..

గర్భనిరోధక మాత్ర తీసుకున్న తర్వాత చాలా మందిలో వికారంగా ఉండే సమస్యను ఎదుర్కొంటుంటారు. శరీరంలో హార్మోన్ల పెరుగుదల వల్ల వికారం సంభవిస్తుంది. వికారం అనుభవించే వారిలో తలతిరగడం వంటి సమస్య కూడా ఎదురవుతుంది. కడుపు నొప్పి కూడా కనిపిస్తుంది. తలనొప్పి అనేది గర్భనిరోధక మాత్ర దుష్ప్రభావం కూడా కావచ్చు. గర్భనిరోధక మాత్రలు తీసుకునేటప్పుడు తలనొప్పులను ఎదుర్కొనే వారు ఇతర గర్భనిరోధక పద్ధతులకు మారడం గురించి ఆలోచించడం ఉత్తమం.

మూడ్ స్వింగ్..

గర్భ నిరోధక మాత్రలు తీసుకోవడం వల్ల మూడ్ లేదా లిబిడోలో మార్పులు కూడా సంభవిస్తాయి. కొంతమంది ఈ మాత్రలు తీసుకునేటప్పుడు డిప్రెషన్‌ను అనుభవిస్తుంటారు. మరికొందరిలో లిబిడో తగ్గడం లేదా ఉద్రేకం పొందడంలో ఇబ్బంది కనిపిస్తుంది. ఈ దుష్ప్రభావాలను అనుభవించే వారు వేరే రకమైన గర్భనిరోధక పద్ధతికి మారడం లేదా తీసుకుంటున్న మందుల మోతాదును సర్దుబాటు చేయడం గురించి వైద్యులతో చర్చించాలి.

బరువులో మార్పు..

గర్భనిరోధక మాత్రలు వాడేవారిలో శరీర బరువులో ఆకస్మిక మార్పు కనిపిస్తుంది. ఈ మాత్రల్లో ఉండే ప్రొజెస్టిన్ ఆకలిని పెంచుతుంది. దాంతో అవసరానికి మించి ఎక్కువగా తినడం వల్ల బరువు పెరిగే అవకాశం ఉంటుంది. కొంతమందిలో రొమ్ము సున్నితత్వం లేదా వాపు వంటివి కనిపిస్తాయి. మరికొందరి శరీరంలో హార్మోన్ల మార్పుల ఫలితంగా బరువు పెరగవచ్చు లేదా తగ్గవచ్చు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు మరో విధానంలోకి మారడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

హార్ట్ ఎటాక్, స్ట్రోక్.

అరుదైన సందర్భాల్లో గర్భనిరోధక మాత్రలు రక్తం గడ్డకట్టడం, గుండెపోటు, స్ట్రోక్ వంటి తీవ్రమైన దుష్ప్రభావాలను కలిగిస్తాయి. రక్తం గడ్డకట్టడం, గుండె జబ్బులు లేదా స్ట్రోక్ హిస్టరీ ఉన్న వారు బర్త్ కంట్రోల్ పిల్స్ తీసుకోకూడదు. గర్భనిరోధక మాత్రలు తీసుకునేటప్పుడు ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కాలు వాపు లేదా తీవ్రమైన తలనొప్పి వంటి లక్షణాలు కనిపించగానే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలి.

గర్భనిరోధక మాత్రలు తీసుకునే వారిలో ఒత్తిడి, అనారోగ్యం, హార్మోన్లలో అసమానతలు తదితర కారణాల వల్ల రుతు క్రమంలో మార్పులు వస్తాయి. అదే సమయంలో రుతుస్రావంలో అధికంగా రక్త స్రావం కావటం, 6 నుంచి 7 రోజుల పాటు రుతుస్రావం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. ఈ పిల్స్ మరీ ఎక్కువగా వినియోగిస్తే అసలు పిల్లలు పుట్టే అవకాశమే లేకుండా పోతుందని వైద్యులు చెప్తున్నారు. మధుమేహం, పొగ తాగే అలవాటు ఉన్న స్త్రీలు ఈ గర్భనిరోధక మాత్రలు వాడకపోవటమే మేలు. 10 సంవత్సరాల కంటే ఎక్కువ సమయం పాటు మాత్రలు తీసుకోవటం వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

## తక్కువ వయసులోని మహిళలకు గుండెపోటు వస్తుందా?



తక్కువ వయసులోని మహిళలకు గుండెపోటు వచ్చే అవకాశముందా? అసలు ఎందుకొస్తుంది? రావడానికి గల కారణాలేంటి? వంటి విషయాలపై వైద్యులు ఏమంటున్నారో తెలుసుకుందామా..?!

– 24 ఏళ్ల బ్రిటనీ అనే మహిళ గుండెపోటుకు గురై కుప్పకూలిపోయింది. వెంటనే వైద్యులు సిపిఆర్ చేసి ప్రాణాల్ని కాపాడారు. బ్రిటనీ రోజూ వ్యాయామం చేసినా.. సమతుల్య ఆహారం తీసుకున్నా.. ఆమె గుండెపోటు రావడానికి గల కారణం క్యూటీ సింద్రోమ్ అనే దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతుందోని.. అందువల్లే ఆమె గుండెపోటుకు గురైందని వైద్యులు తెలిపారు.

– దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి వయసు తక్కువైనా.. గుండెపోటు వచ్చే అవకాశముందని వైద్యులు సూచించారు.

– మూర్ఛవ్యాధి సంకేతాలుగా ఉన్న క్యూటి సింద్రోమ్ ఒక్కోసారి పిసిఆర్ చికిత్స చేసే అవకాశం కూడా ఉండదని వైద్యులు చెబుతున్నారు. దీంతో ఒక్కసారిగా గుండె పనితీరు ఆగిపోయి మృతి చెందే అవకాశముంటుందని వైద్యులు చెబుతున్నారు.

## గర్భిణులకు పిగ్మెంటేషన్ సమస్య?



మేడమ్, ఈ మధ్యే నాకు ప్రసవం అయ్యింది. బాబు పుట్టాడు. గర్భధారణ సమయంలో నా చర్మం మీద మచ్చలు వచ్చాయి. ఇప్పటికీ తగ్గలేదు. ఈ సమస్యకు పరిష్కారం ఉందా?

గర్భధారణ సమయంలో చాలామంది మహిళలకు ముఖం, మెడ, చేతులు, చంకలు తదితర భాగాల్లో నల్లటి మచ్చలు ఏర్పడతాయి. కొన్నిసార్లు ప్రసవం తర్వాత కూడా కొనసాగుతాయి. వీటిని వైద్య పరిభాషలో 'క్లోస్మా'గా వ్యవహరిస్తారు. మెలనిన్ అనే అమైనో యాసిడ్ కారణంగానే ఇదంతా జరుగుతుంది. అతినీల లోహిత కిరణాలకు చర్మం ప్రభావితం కావడం వల్ల ఈ సమస్య రావచ్చు. గర్భిణుల విషయానికొస్తే.. హార్మోన్ల మార్పు ప్రధాన కారణం. ఆ సమయంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్ల ఊట అధికంగా ఉంటుంది. ఆ ప్రభావం పిగ్మెంటేషన్‌కు దారితీస్తుంది. హార్మోన్లు సాధారణ స్థితికి చేరుకోగానే.. వాటంతట అవే మాయమైపోతాయి. మాతృత్వం కోసం తీసుకొనే కొన్ని ఔషధాల కారణంగా కూడా ఇలా జరగొచ్చు. జన్యువుల ప్రభావాన్నీ కాదనలేం. మహిళ జీవితంలో ఆ తొమ్మిది నెలలూ కీలకం. కాబట్టి, పిగ్మెంటేషన్ చికిత్స తీసుకోవడం కుదరదు. తీసుకున్నా.. దుష్ప్రభావం చూపవచ్చు. కాబట్టి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం, ఎండలోకి వెళ్తున్నప్పుడు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవడం మంచిది. హైడ్రేషన్ ద్వారా కూడా ఈ సమస్యను నియంత్రించవచ్చు. కాబట్టి, పుష్కలంగా నీళ్లు తాగాలి. ప్రసవం తర్వాత, అదీ పిల్లలకు పాలిచ్చే దశ పూర్తయిన తర్వాతే.. పిగ్మెంటేషన్ చికిత్సకు వెళ్లడం శ్రేయస్కరం. మందులు, లేపనాలు, లేజర్ థెరపీ ద్వారా ఈ మచ్చలను తొలగించడం సాధ్యమే. కాబట్టి, భయపడాల్సిన పన్లేదు.



# ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్.. ప్లాన్ ఏమిటంటే?

ఆర్ఆర్ఆర్ తర్వాత ఏడాది పాటు గ్యాప్ తీసుకున్న ఎన్టీఆర్ ప్రస్తుతం కొరటాల శివ సినిమాని సెట్స్ పైకి తీసుకెళ్ళే ప్రయత్నంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ మూవీకి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ కంప్లీట్ కాగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రస్తుతం జరుగుతుంది. ఆర్ఆర్ఆర్ తర్వాత తారక్ చేస్తున్న సినిమా కావడంతో కచ్చితంగా భారీ అంచనాలు ఉంటాయి. అయితే సెంటిమెంట్ పరంగా చూసుకున్న రాజమౌళితో సినిమా చేసిన తర్వాత సదరు హీరో నెక్స్ట్ మూవీ డిజాస్టర్ అవుతుంది. ఈ సెంటిమెంట్ ని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే రెండు సార్లు అనుభవం ఉండటంతో తారక్ ఈ సారి పకడ్బందీగా స్క్రిప్ట్ ని కొరటాలతో సిద్ధం చేయించాడు. ఈ స్క్రిప్ట్ వర్క్ అనుకున్న ప్రకారం రావడంతో ఇప్పుడు ధైర్యం చేసి సెట్స్ పైకి వెళున్నారు. పాన్ ఇండియా లెవల్ లో తెరకెక్కుతున్న సినిమా కావడం



కూడా పక్కా ప్లాన్ తో ప్రాజెక్ట్ ని తారక్ స్టార్ట్ చేస్తున్నాడు. ఇక ఈ నెల ఆఖరు ఈ మూవీకి సంబందించిన ఓపెనింగ్ లాంచింగ్ ఉంటుందని ఇప్పటికే తారక్ చెప్పేసాడు. అలాగే మార్చి నెల ఆఖరులో మూవీ రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కాబోతుంది. ఇదిలా ఉంటే దీని తర్వాత తారక్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సినిమా చేయబోతున్న సంగతి తెలిసిందే. ప్రశాంత్ నీల్ సలార్ మూవీ షూటింగ్ ఈ నెల ఆఖరు లేదంటే మార్చి మొదటి వారంలో కంప్లీట్ చేసి దాని పోస్ట్ ప్రొడక్షన్ పై దృష్టి పెడతాడు. ఈ నేపథ్యంలో ఆగష్టులో ఎన్టీఆర్ 31 మూవీకి సంబందించిన ప్రీప్రొడక్షన్ వర్క్ ని స్టార్ట్ చేసే ఛాన్స్ ఉందని తెలుస్తుంది. సెప్టెంబర్ లో సలార్ మూవీ రిలీజ్ అయిన తర్వాత నవంబర్ లేదా డిసెంబర్ నెలలో ఎన్టీఆర్ చిత్రం షూటింగ్ మొదలు పెట్టె ఛాన్స్ ఉందనే మాట టాలీవుడ్ సర్కిల్ లో వినిపిస్తుంది. అప్పటికి ఎన్టీఆర్ కొరటాల మూవీ షూటింగ్ కూడా కంప్లీట్ అవుతుందని తెలుస్తుంది. ఎన్టీఆర్ కొరటాల మూవీ షూటింగ్ వైజాగ్ హైదరాబాద్ గోవాలో మాత్రమే జరగనుంది. ఈ నేపథ్యంలో గ్యాప్ లేకుండా షెడ్యూల్స్ ని కొరటాల ప్లాన్ చేసినట్లు టాక్.

# సలార్ మూవీ ఎంతవరకు వచ్చిందంటే?



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం మూడు ప్రాజెక్ట్స్ ని సెట్స్ పైన ఉంచాడు. అందులో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సలార్ మూవీ షూటింగ్ జరుగుతుంది. దాంతో పాటు మారుతీ సినిమా కూడా సెట్స్ పైన ఉంది. అలాగే ప్రాజెక్ట్ కె మూవీ సెట్స్ పైనే ఉంది. ఈ మూడు ప్రాజెక్ట్స్ దేనికవే ప్రత్యేకం కావడం విశేషం. ఇదిలా ఉంటే సలార్ మూవీ షూటింగ్ చివరి దశకి వచ్చినట్లుగా తెలుస్తుంది. సలార్ సినిమాని కూడా ప్రశాంత్ నీల్ రెండు భాగాలుగానే తెరకెక్కిస్తున్నట్లుగా టాక్ వినిపిస్తుంది. కేజీఎఫ్ సిరీస్ తో సూపర్ సక్సెస్ అందుకున్న ప్రశాంత్ నీల్ సలార్ ని కూడా అదే దిశలో నడిపించడానికి సిద్ధం అయ్యాడు. ఈ నేపథ్యంలో పార్ట్ వన్ షూటింగ్ కంప్లీట్ అయినట్లు తెలుస్తుంది. పార్ట్ 2 కి సంబందించిన కొన్ని కీలక సన్నివేశాలు షూట్ చేసినట్లు టాక్. అయితే సలార్ సినిమాకి సంబందించిన కొన్ని కీలక సన్నివేశాలు ప్యాచ్ వర్క్ మొత్తం ఈ నెల ఆఖరు లోపు ఫినిష్ చేసే యోచనలో ప్రశాంత్ నీల్ ఉన్నాడని తెలుస్తుంది. ఇప్పటికే సలార్ పార్ట్ 1 రిలీజ్ ని సెప్టెంబర్ లో ఉంటుందని ప్రశాంత్ నీల్ అనౌన్స్ చేసేశారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం టాలీవుడ్ లో వినిపిస్తున్న టాక్ ప్రకారం సలార్ రెండు భాగాలు ఈ ఏడాదిలో రిలీజ్ కావని తెలుస్తుంది. పార్ట్ 1 ని ఈ ఏడాది కంప్లీట్ చేసి రిలీజ్ చేయడానికి సిద్ధం అయ్యాడు. దీని తర్వాత ఎన్టీఆర్ మూవీని స్టార్ట్ చేయబోతున్నట్లుగా సమాచారం. ఇక ఆ సినిమా కంప్లీట్ అయిన తర్వాత మరల సలార్ పార్ట్ 2ని తెరకెక్కించి ప్రేక్షకులకి అందించడానికి ప్రశాంత్ నీల్ ప్లాన్ చేసుకున్నట్లుగా ఇండస్ట్రీలో వినిపిస్తుంది. దీంతో సలార్ పార్ట్ 2 రిలీజ్ అనేది వచ్చే ఏడాది ఆఖరులో లేదంటే 2025 ఆరంభంలో ఉండే ఛాన్స్ ఉంటుందని ఫిల్మ్ నగర్ సర్కిల్ లో వినిపిస్తున్న మాట.

# మూడు గెటప్స్ లో బాలయ్య.. ఇంట్రెస్టింగ్ ?

నందమూరి బాలకృష్ణ – సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కలయికలో సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. అయితే, బాలయ్య కోసం తాను ఓ భారీ యాక్షన్ కామెడీ సబ్జెక్ట్ ను రాసినట్లు అనిల్ రావిపూడి ఆ మధ్య ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. కాగా ఈ సినిమా కథ గురించి, ఈ సినిమాలో బాలయ్య గెటప్స్ గురించి ఇంట్రెస్టింగ్ అప్ డేట్స్ వినపిస్తున్నాయి. బాలయ్య మొత్తం ఈ సినిమాలో మూడు గెటప్స్ లో కనిపించబోతున్నాడు. బాలయ్య పాత్ర ఒక్కటే అయినా.. మూడు స్టేజ్ ల్లో మూడు లుక్స్ లో బాలయ్య కనిపిస్తాడట. ముప్పై ఏళ్ల యువకుడి గెటప్ తో పాటు ఏభై ఏళ్ల వ్యక్తిగా.. అలాగే



డెబ్బై ఏళ్ల పెద్దాయన గా కూడా బాలయ్య ఈ సినిమాలో కనిపించబోతున్నాడు. ఇక కథ విషయానికి వస్తే.. ముప్పై ఏళ్ల వయసులో ఆవేశంలో చేసిన గొడవల కారణంగా హీరోకి 14 ఏళ్లు శిక్ష పడుతుందట. అలా జైలు నుంచి ఏభై ఏళ్ల వయసులో విడుదలైన హీరో జీవితంలో చోటు చేసుకునే సంఘటనల ఆధారంగా ఈ సినిమా సాగుతుందట. బాలయ్య క్యారెక్టర్ వెరీ పవర్ ఫుల్ గా ఉన్నప్పటికీ.. మరోవైపు ఆ పాత్ర తాలూకు ఆలోచనలు, యాక్టివిటీస్ వెరీ ఫన్నీగా సాగుతాయట. అలాగే సినిమాలో ఫాదర్ – కూతురు మధ్య ఓ ఎమోషనల్ ట్రాక్ కూడా ఫుల్ ఎంటర్ టైన్ గా ఉంటుందని తెలుస్తోంది. అలాగే, ఫ్లాష్ బ్యాక్ చాలా వైల్డ్ గా ఉంటుందట. మొత్తానికి అనిల్ – బాలయ్య కలయికలో సినిమా అనగానే ఈ సినిమా పై భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి.

# శాకుంతలం ప్రేమికుల రోజు స్పెషల్ సమంత నుంచి ఐ ఫీస్ట్

టాలీవుడ్ లో లేడీ ఓరియంటెడ్ కథలతో దూసుకుపోతున్న స్టార్ హీరోయిన్ సమంత. ఈ బ్యూటీ గత ఏడాది యశోద సినిమాతో ప్రేక్షకుల ముందుకి వచ్చి సూపర్ హిట్ ని తన ఖాతాలో వేసుకుంది. ఈ ఏడాది శాకుంతలం మూవీతో ప్రేక్షకుల ముందుకి రావడానికి ఆమె సిద్ధం అవుతుంది. మహాభారతంలో శాకుంతల దుష్యంతుడి ప్రేమ కావ్యం ఆధారంగా ఈ సినిమాని గుణశేఖర్ ఆవిష్కరించారు. ఇదిలా ఉంటే ఈ సినిమాని ఏప్రిల్ లో రిలీజ్ చేయడానికి చిత్ర యూనిట్ సిద్ధం అవుతుంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతూ ఉండటంతో సినిమాని వాయిదా వేసారు. అయితే ఈ మూవీకి సంబందించిన బజ్ ఉండే విధంగా చిత్ర యూనిట్ సాంగ్స్ ని రిలీజ్ చేస్తూ ఉంది. ఇప్పటికే రెండు సాంగ్స్ ని ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చారు. మణిశర్మ ఈ మూవీకి సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే. ప్రేమకావ్యంలో ఉండే గొప్పతనాన్ని ఆవిష్కరించే విధంగా మణిశర్మ సరికొత్తగా సంగీతాన్ని అందిస్తున్నారు. ఇక ఈ సాంగ్స్ కూడా అద్భుతంగా ఆకట్టుకున్నాయి. ప్రేక్షకులకి భాగా చేరువ అయ్యాయి. మెలోడియస్ గా సాగే ఈ సాంగ్స్ విన్న తర్వాత చాలా కాలం తర్వాత కాస్తా వినసొంపుగా ఉన్నాయనే ఫీలింగ్ ని కలిగించాయి. ఇదిలా ఉంటే ప్రేమికుల రోజు సందర్భంగా శాకుంతలం మూవీ నుంచి మరో సాంగ్ ని విజువల్ ట్రీట్ గా ప్రేక్షకులకి అందించడానికి చిత్ర యూనిట్ రెడీ అవుతుంది. ఈ సాంగ్స్ మధుర గతమా అంటూ సాగే ఈ రొమాంటిక్ సాంగ్ ని ఫిబ్రవరి 14న రిలీజ్ చేయబోతున్నట్లు క్లారిటీ ఇచ్చారు. ఇక ఈ సాంగ్స్ పోస్టర్ చూస్తూ ఉంటే కచ్చితంగా ఇదొక ఐఫీస్ట్ గా సాంగ్ గా మారే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తుంది. ముఖ్యంగా సమంత నుంచి



పుష్పలో ఊ అంటావా సాంగ్ రొమాంటిక్ యాంగిల్ లో కుర్రాళ్ళకి భాగా చేరువ అయ్యింది. అందులో సమంత ఎక్స్ ప్రెషన్స్ తో అందరికి చెమటలు పట్టించింది. మరోసారి అలాంటి రొమాంటిక్ యాంగిల్ లో సాగే సాంగ్ ని ఇప్పుడు తీసుకొస్తున్నారు. ఇక ఈ సాంగ్ లో సమంత లీడ్ దేవ్ పటేల్ తో ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ అదిరిపోతుంది అని భావిస్తున్నారు. కచ్చితంగా సమంత నుంచి రొమాంటిక్ యాంగిల్ లో ప్రేక్షకులకి గిలిగింతలు పెట్టె స్థాయిలో ఈ సాంగ్ ఉంటుందనే మాట వినిపిస్తుంది.



# వైరల్ అవుతోన్న కింగ్ నాగార్జున సరికొత్త స్టైలిష్ పిక్స్!

టాలీవుడ్ స్టార్ హీరో, కింగ్ నాగార్జున చివరిసారిగా డైరెక్టర్ ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహించిన యాక్షన్ థ్రిల్లర్ ది ఘోస్ట్‌లో కనిపించారు. ఈ సినిమా తర్వాత నాగార్జున తన నెక్స్ట్ సినిమాను ప్రకటించలేదు. చాలా రోజుల తర్వాత నాగార్జున ఈరోజు ఉదయం పబ్లిక్ గా కనిపించారు. అతను తన కుమారులు నాగ చైతన్య మరియు అఖిల్‌తో కలిసి హైదరాబాద్ ఈ ఫ్రిక్స్ చూడటానికి వచ్చారు. పొడవాటి జుట్టు మరియు గడ్డంతో సూపర్ స్టైలిష్ గా ఉన్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ధమాకా రైటర్ ప్రసన్న కుమార్ దర్శకత్వంలో నాగార్జున ఒక యాక్షన్ కామెడీ సినిమాలో నటించనున్నాడని వినికిడి. ఈ సినిమాలో అల్లరి నరేష్ కీలక పాత్రలో నటించే అవకాశం ఉంది. ఈ చిత్రం కి సంబంధించిన మరిన్ని వివరాలు రానున్న వారాల్లో వెల్లడి కానున్నాయి.

# ఫిల్మ్ సిటీలో 'పుష్ప 2' భారీ యాక్షన్ !

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ – క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో అత్యంత ప్రతిష్టాత్మకంగా వచ్చిన 'పుష్ప– ది రైజ్' చిత్రం సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుతం, 'పుష్ప 2' పైనే బన్నీ – సుకుమార్ తమ ఫుల్ ఫోకస్ పెట్టారు. ప్రస్తుతం పుష్ప 2 షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఈ షూట్ లో అల్లు అర్జున్ పాల్గొంటున్నాడు. బన్నీ పై ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ ను సుకుమార్ షూట్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక పుష్ప 2 ఇంటర్వెల్ లో బన్నీ డాన్ లుక్ లో కనిపిస్తాడని.. రష్మిక





పాత్ర పాయింట్ ఆఫ్ వ్యూలో వచ్చే ఈ ట్విస్ట్, గొప్ప థ్రిల్లింగ్ ఎలిమెంట్ గా నిలుస్తోందని.. పైగా ఈ ట్విస్ట్ ఎవ్వరూ ఊహించని విధంగా ఉంటుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఇక ఈ పుష్ప సీక్వెల్ లో కొన్ని కీలక పాత్రలతో పాటు పలు కొత్త పాత్రలు కూడా ఈ పుష్ప 2లో పరిచయం కానున్నాయి. ప్రముఖ నటీనటులు ఈ సీక్వెల్ లో కనిపించనున్నారు. అందుకే పుష్ప 2 కోసం ఫ్యాన్స్ రెట్టింపు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మించింది. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించనున్నారు. ఏది ఏమైనా 'పుష్ప సినిమాలో అల్లు అర్జున్ యాక్టింగ్ ఓ రేంజ్‌లో ఉంది. పుష్పరాజ్ లాంటి పాత్రను స్టార్ హీరో చేసి మెప్పించడం చాలా రిస్క్. బన్నీ ఆ రిస్క్ ను బాగా హ్యాండిల్ చేశాడు.

# ఇంట్రెస్టింగ్ పోస్ట్ షేర్ చేసిన హీరో నాని

నేచురల్ స్టార్, టాలీవుడ్ టాలెంటెడ్ హీరో నాని హీరోగా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం లో తెరకెక్కిన రా అండ్ విలేజ్ యాక్షన్ డ్రామా దసరా. ఈ చిత్రం ను మార్చ్ 30, 2023 న వరల్డ్ వైడ్ గా థియేటర్ల లో గ్రాండ్ గా రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తుంది. ఈ మేరకు అందుకు సంబంధించిన ప్రమోషన్స్ ను వేగవంతం చేయడం జరిగింది. ఈ చిత్రం కి సంబంధించిన ప్రచార చిత్రాలకి ప్రేక్షకుల నుండి, అభిమానుల నుండి ఇప్పటికే సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్, టీజర్ లు సినిమా పై భారీ అంచనాలను పెంచేశాయి. ఈ చిత్రం కి సంబంధించిన సెకండ్ సింగిల్ ఓరి వారి పాటను ఈ 13 వ తేదీన తెలుగు తో పాటుగా, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేశారు. ఇప్పటికే సెకండ్ సింగిల్ ప్రోమో ను రిలీజ్



చేయగా, హీరో నాని ఒక ఇంట్రెస్టింగ్ పోస్ట్ ను షేర్ చేశారు. మ్యూజిక్ డైరెక్టర్ సంతోష్ నారయణన్ ఈ సెకండ్ సింగిల్ ను హమ్ చేస్తున్న షూటింగ్ క్లిప్ ను షేర్ చేశారు. అది చాలా బాగుంది. సరదాకి షూట్ చేశామని, కానీ, స్క్రీన్ పై సంతోష్ నారాయణన్ చంపేశారు అంటూ చెప్పుకొచ్చారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ రా అండ్ విలేజ్ డ్రామా లో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటిస్తుంది.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com